కపిలేశ్వరాలయంలో భద్రత కట్టుదిట్టం

కార్తీక మాసం రెండో సోమవారం. అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. కాశీబుగ్గ ఘటన నేపథ్యంలో ఆలయ మార్గంలో ఆంక్షలు విధించారు. పోలీసులు, టీటీడీ విజిలెన్స్ అధికారులు ముందస్తు జాగ్రత్తగా అన్నారావు సర్కిల్ మీదుగా కపిలేశ్వరాలయానికి వెళ్లే కేటీరోడ్డు రెండు వైపులా బారికేడ్లు పెట్టి వాహన రాకపోకలను హరేరామ హరేకృష్ణ మార్గం వైపు మళ్లించారు. ద్విచక్ర వాహనాలను కూడా అనుమతించలేదు. ఆలయంలోకి నంది సర్కిల్ నుంచే క్యూలైన్‌ను ఏర్పాటు చేశారు. ఆంజనేయస్వామి సన్నిధి సమీపంలోని ఉద్యానవనం (జంగిల్ బుక్)లో కార్తీక దీపాలు వెలిగించడానికి వెళ్లి, వచ్చేలా క్యూలైన్‌ను సడలించారు. జలపాతం, పుష్కరిణి వైపు వెళ్లకుండా గేట్లను అమర్చారు. స్వామి, అమ్మవార్ల దర్శనం చేసుకుని బయటకు రాగి, వేప చెట్టు వద్ద పూజలు చేయడం ఆనవాయితీ. ఈసారి ఆ అవకాశం లేకుండా క్యూలైన్ పెట్టారు. కార్తీక దీపాలు వెలిగించాక దర్శనానికి వెళ్లడానికి భక్తులు అవస్థలు పడ్డారు. కొందరు దర్శనం చేసుకోకుండానే దీపాలు వెలిగించి తిరుగుముఖం పట్టారు. ఇక, కపిలేశ్వరాలయం దీపాల వెలుగులతో నిండిపోయింది. జంగిల్ బుక్‌లో దీపాలు వెలిగించి పూజలు చేశారు. సాయంత్రం దీపాలు వెలిగించడానికి వచ్చే భక్తుల సంఖ్య కొంత పెరిగింది. ఇక, కపిలతీర్థంలోకి అనుమతించలేదు. జిల్లాలోని అన్ని శివాలయాలు, జలపాతాల వద్ద కూడా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.





- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధమైన వైష్ణవ పుష్కరిణిలో లక్ష దీపోత్సవం నిర్వహించారు. పుష్కరణి చుట్టూ నేతిదీపాలను వెలిగించారు. - శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

సత్యవేడుకు రెవెన్యూ డివిజన్ వచ్చేనా?



- శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట డివిజన్ల నడుమ చీలిన నియోజకవర్గం
- ఎన్నికల ప్రచారంలో పరిశీలిస్తానంటూ చంద్రబాబు హామీ
- ప్రభుత్వానికి తరచూ ఎమ్మెల్యే వినతులు

జిల్లాలో మారుమూల నియోజకవర్గంగా పేరుపడిన సత్యవేడుకు రెవెన్యూ డివిజన్ మంజూరు చేయాలన్న డిమాండ్ ఊపందుకుంటోంది. ఈ నియోజకవర్గంలోని ఏడు మండలాలూ ప్రస్తుతం శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట డివిజన్ల నడుమ విభజితమైన సంగతి తెలిసిందే. సత్యవేడును రెవెన్యూ డివిజన్ చేసి నియోజకవర్గం మొత్తాన్ని దాని పరిధిలోకి తేవాలన్నది అక్కడి ప్రజలు, ప్రజాప్రతినిధుల కోరిక.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

సత్యవేడు నియోజకవర్గం భౌగోళికంగా అతి పెద్దది. సత్యవేడు, నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్యపాలెం మండలాలున్నాయి. గత ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేపట్టినపుడు వీటిలో సత్యవేడు, వరదయ్యపాలెం, బీఎన్ కండ్రిగ మండలాలు మూడింటినీ సూళ్ళూరుపేట రెవిన్యూ డివిజన్ పరిధిలో చేర్చింది. మిగిలిన నాగలాపురం, పిచ్చాటూరు, కేవీబీపురం, నారాయణవనం మండలాలను శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ పరిధిలో కలిపింది. దీంతో ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షించే సమయంలో ఇద్దరు ఆర్డీవోల నుంచీ సమాచారం తీసుకోవాల్సి వస్తోంది. సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే ఇద్దరు ఆర్డీవోలను సంప్రదించాలి. ఇది పాలనాపరంగా అసౌకర్యంగా మారుతోంది.

సత్యవేడు డివిజన్‌పై ఎన్నికల్లో హామీ

గత ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు సత్యవేడుకు వచ్చిన సందర్భంలో పార్టీ అభ్యర్థి హోదాలో కోనేటి ఆదిమూలం ఈ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. దీనిపై స్పందించిన చంద్రబాబు బహిరంగసభలో ప్రసంగిస్తూ దీన్ని ప్రస్తావించారు. అధికారంలోకి వస్తే సత్యవేడులో రెవెన్యూ డివిజన్ కేంద్రం ఏర్పాటు అంశంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి నియోజకవర్గ ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తానని హామీ ఇచ్చారు.

ప్రస్తుత కసరత్తులోనే తేల్చాలంటున్న జనం

గత వైసీపీ ప్రభుత్వం అశాస్త్రీయంగా జరిపిన జిల్లాల, రెవెన్యూ డివిజన్ల పునర్విభజనను సరిదిద్దేందుకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తున్న సంగతి తెలిసిందే. నగరి, తిరుపతి, శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్లలో మార్పులు అనివార్యం కానున్నాయి. నగరి డివిజన్ తిరుపతి జిల్లా పరిధిలోకి రావడంతో పాటు తిరుపతి డివిజన్ పరిధి నుంచీ వడమాలపేట, పుత్తూరు మండలాలు నగరి డివిజన్ పరిధిలోకి వెళ్లనున్నాయి. అలాగే వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలు శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలోకి రానున్నాయి. ఈ మార్పులు ఎలాగూ జరుగుతాయి కనుక అదే సందర్భంలో సత్యవేడు డివిజన్ ఏర్పాటుపైనా సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతో పాటు ప్రజలు సైతం కోరుతున్నారు. సత్యవేడు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసి నియోజకవర్గంలోని ఏడు మండలాలనూ దాని పరిధిలోకి తేవాలని అభ్యర్థిస్తున్నారు. ముఖ్యంగా సత్యవేడు, వరదయ్యపాలెం, బీఎన్ కండ్రిగ మండలాలు పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. శ్రీసిటీ సెజ్‌తో పాటు పలు ఏపీఐఐసీ పారిశ్రామిక వాడలు ఇప్పటికే ఉండగా, మరిన్ని పార్కులు ఏర్పాటవుతున్నాయి. దీంతో తరచూ ప్రభుత్వం ఈ మండలాల్లో పరిశ్రమల కోసం భూములు సేకరిస్తోంది. సత్యవేడు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటైతే భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తయ్యే అవకాశముంటుంది. అదే సమయంలో నియోజకవర్గ ప్రజల రెవెన్యూ, భూముల సంబంధ సమస్యల పరిష్కారం కూడా త్వరగా జరిగేందుకు ఆస్కారముంటుంది. నియోజకవర్గ ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా సత్యవేడు డివిజన్ ఏర్పాటుపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాల్సిన అవసరముంది.

విశ్రాంత ఉద్యోగుల పెన్షన్‌లో
ఒకరికి కోత.. మరొకరికి పునరుద్ధరణ

తిరుపతి(వైద్యం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈఎస్ఐ ఆస్పత్రిలో రిటైరైన డాక్టర్‌కు పెన్షన్‌లో 9 శాతం కోత పడింది. నిధుల దుర్వినియోగం ఆరోపణలపై వైద్య ఆరోగ్య శాఖ విశ్రాంత ఏవోకు గతంలో పెన్షన్‌లో విధించిన కోతను ఎత్తివేశారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ● తిరుపతిలోని ఈఎస్ఐ ఆస్పత్రిలో స్పెషల్ గ్రేడ్ సివిల్ సర్జన్‌గా రిటైరైన డాక్టర్ సీకే రమేష్‌కుమార్.. 2017లో కర్నూలు జిల్లాలోని ఈఎస్ఐ ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. ఆ సమయంలో నర్సింగ్ హోమ్‌లు, ప్రవేటు ఆస్పత్రులు స్థాపించి వాటిల్లో అర్హత లేని వ్యక్తులను వైద్యులుగా నియమించి రోగులకు వైద్యం అందించారంటూ ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. దీనిపై ప్రభుత్వం విజిలెన్సు విచారణ చేపట్టింది. ఆ ఆరోపణలు వాస్తవాలుగా నిర్ధారించడంతో ఆయనపై అప్పట్లో క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదిక అందింది. దీంతో ఆయనకు అందుతున్న పింఛనులో మూడేళ్ల పాటు 9 శాతం కోత విధిస్తూ వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు.

● 2015లో చిత్తూరులోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పరిపాలన అధికారి(ఏవో)గా పనిచేస్తున్న ఎస్ అరుణాచలం తప్పుడు మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను క్లెయిమ్ చేసి నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలతో అప్పట్లో విచారణ చేపట్టారు. ఈ కేసు విచాణరలో ఉండగా ఆయన 2018లో పదవీ విరమణ పొందారు. విచారణ అనంతరం ఆయనకు అందే పింఛనులో 5 శాతం శాశ్వతంగా కోత విధించాలని అప్పట్లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై బాధితుడు ఎస్ అరుణాచలం ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడంతో బాధితుడికి ఎటువంటి కోత లేకుండా పూర్తి స్థాయిలో పింఛను అందించడంతోపాటు ఆయనకు రావాల్సిన బకాయిలను కూడా అందించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయనకు రావాల్సిన పెన్షను బకాయిలతో కలిసి నెలలోపు చెల్లించాలని సౌరభ్‌గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు.

జూలో ఎర్ర మెడ వాలాబీ మృతి



వాలాబీ (ఫైల్ ఫొటో)

మంగళం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ జూపార్కులో సోమవారం ఆడ ఎర్రమెడ వాలాబీ అనారోగ్యంతో మృతిచెందినట్లు జూపార్కు క్యూరేటర్ సెల్వం తెలిపారు. మూడు రోజుల క్రితం టాక్సో ప్లాస్మోసిస్ వ్యాధిసోకి మగ ఎర్రమెడ వాలాబీ మృతి చెందగా.. ఇపుడు అదే సమస్యతో ఆడవాలాబీ మృతి చెందిందన్నారు. ఈ ఏడాది ఆగస్టులో గుజరాత్‌కు చెందిన రాధేకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్టు ఒక జత మీర్ కాట్స్, ఒక జత కామన్ మార్మోసెట్స్‌తో పాటు ఒక జత ఎర్ర మెడగల వాలాబీలను జూపార్కుకు విరాళంగా ఇచ్చారు. వాలాబీ కళేబరానికి పోస్టుమార్టం నిమిత్తం వెటర్నరీ యూనివర్సిటీకి తరలించారు.



వైద్యశాల ప్రారంభం అనంతరం మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రూ.500కోట్లతో త్వరలో ఇంట్రామోడల్ బస్సు టెర్మినల్

రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడా లేని విధంగా అత్యాధునిక హంగులతో తిరుపతి నగరంలో రూ.500కోట్లతో ఇంట్రా మోడల్ బస్సు టెర్మినల్ అతి త్వరలో నిర్మించబోతున్నామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం మధ్యాహ్నం ఆయన అలిపిరి రోడ్డులో నూతనంగా నిర్మించిన ఆర్టీసీ వైద్యశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రూ. 1.90కోట్లతో అధునాతన సౌకర్యాలతో వైద్యశాల, శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చే ఆర్టీసీ ప్రముఖులు, అధికారులు, అతిథుల కోసం రూ.2కోట్లతో విశ్రాంతి గదులు నిర్మించామన్నారు. ఆర్టీసీని అభివృద్ధి బాటలో నడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్టీసీలో ప్రమాదాల నివారణకు చట్టాలను కఠినతరం చేయనున్నట్లు చెప్పారు. కర్నూలులో బస్సు ప్రమాదం తర్వాత చట్టాలను కఠినతరం చేస్తున్నామన్నారు. ఫిట్‌నెస్ లేని బస్సులను ఎక్కడికక్కడ సీజ్ చేస్తున్నామన్నారు. వందశాతం ప్రమాణాలు కలిగిన బస్సులు మాత్రమే రోడ్డెక్కేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. ఆర్ అండ్ బీ, హైవేస్‌లో ఎక్కువ ప్రమాదాలు జరిగే స్థలాలను బ్లాక్‌స్పాట్స్‌గా గుర్తించి, అక్కడ తీసుకోవాల్సిన చర్యలపై ఆలోచన చేస్తున్నామన్నారు. అంతకు ముందు ఆయన వైద్యశాలను, ఎండీ ద్వారక తిరుమలరావు గెస్ట్‌హౌస్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కడప, నెల్లూరు జోనల్ ఛైర్మన్లు పూల నాగరాజు, సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, ఈడీలు చెంగల్‌రెడ్డి, చంద్రశేఖర్, రవివర్మ, చీఫ్ ఇంజనీర్ వెంకటరమణ పాల్గొన్నారు.

రెండు మద్యం దుకాణాలకు
మళ్లీ నోటిఫికేషన్

- దరఖాస్తుల సమర్పణకు 10న ఆఖరు గడువు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటి వరకు లైసెన్సు ఫీజు చెల్లించని రెండు మద్యం దుకాణాలకు ఎక్సైజ్ శాఖ సోమవారం మళ్లీ నోటిఫికేషన్ జారీ చేసింది. సూళ్లూరుపేట మున్సిపల్ పరిధిలో.. దొరవారిసత్రంలోని ఈ దుకాణాలకు ఈ నెల 10 వతేదీ లోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించార.ఉ వచ్చిన దరఖాస్తులను 12న 8 గంటలకు కలెక్టరేట్‌లో పరిశీలించి లాటరీ ద్వారా ఎంపిక చేస్తారు. రానున్న 11 నెలలకు గాను సూళ్ళూరుపేట మున్సిపల్ పరిధిలో అయితే ఎక్సైజ్ ట్యాక్స్ కింద రూ 65,54,167, దొరవారిసత్రం పరిధిలో రూ.55,45,834 చెల్లించాలని ఎక్సైజ్ ఈఎస్ నాగమల్లేశ్వర రెడ్డి తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా లేదా ఆఫ్‌లైన్ ద్వారా లేదా హైబ్రిడ్ విధానం ద్వారా దరఖాస్తు చేయవచ్చన్నారు.

బంధువుల ఇంటికొచ్చి వెళ్తూ..!

ట్యాంకర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తండ్రీ కొడుకుల దుర్మరణం



రూపేష్, సుబ్రహ్మణ్యం (ఫైల్‌ఫొటోలు)

పెళ్లకూరు, నవంబరు, 3 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం పెసలగుర్రప్పతోట వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులు మృతిచెందారు. శ్రీకాళహస్తి పట్టణం వీఎంపల్లె ప్రాంతానికి చెందిన ఉలస సుబ్రహ్మణ్యం(31), తన కుమారుడు రూపేష్(9)తో కలిసి నాయుడుపేటలో బంధువుల ఇంటికి మోటార్ సైకిల్‌పై వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో పెసలగుర్రప్పతోట వద్ద రాంగ్ రూట్‌లో వెళ్తూ ట్యాంకర్‌ను ఢీకొన్నారు. సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతిచెందారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ నాగరాజు.. తీవ్రంగా గాయపడిన రూపేష్‌ను ఎన్‌హెచ్ అంబులెన్స్‌లో నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వెంటిలేటర్ లేకపోవడంతో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించగా, అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం ఎరతో సైబర్ టోకరా

- రూ.17.99 లక్షలకు ఎసరు

తిరుపతి(నేరవిభాగం)నవంబరు3(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం వస్తుందనే ఆశతో సైబర్ ఉచ్చులో పడి మోసపోయాడో వ్యక్తి. రూ.17.99 లక్షలు పోగొట్టుకున్నాడు.ఎస్ఐ లోకేష్‌బాబు కథనం మేరకు..ఈ ఏడాది జూన్‌లో ప్రియా అనే పేరుతో ఫేస్‌బుక్ ద్వారా బాధితునికి ఓవ్యక్తి పరిచయమయ్యాడు. టెలిగ్రామ్ గ్రూపులు, వాట్సాప్ నెంబర్ల ద్వారా ఉద్యోగ ఆఫర్లున్నాయని నమ్మించాడు. మొదట రిజిస్ట్రేషన్ ఫీజు, సెక్యూరిటీ డిపాజిట్, రూమ్ చార్జీలు, జీఎస్టీ, ఎస్‌జీఎస్టీ వంటి మాటలు చెప్పి పలు సార్లు డబ్బులు జమ చేయించుకున్నాడు. తర్వాత ఫోటోలు, సంతకం తీసుకుని ఎడిట్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేసి బ్లాక్ మెయిల్ చేయడం మొదలుపెట్టాడు. ఇలా 171 ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా రూ.17.99 లక్షల మేర జమ చేయించుకున్నాడు. తిరిగి డబ్బులు ఇవ్వమంటే అదిగో ఇదిగో అంటూ వాయిదాలు వేస్తూ వచ్చాడు. చివరికి తాను సైబర్ వలలో పడి మోసపోయానని గుర్తించిన బాధితుడు సోమవారం అలిపిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ కేసు నమోదు చేశారు.

ఫిర్యాదుదారులతో దురుసు ప్రవర్తన

- పీజీఆర్ఎస్‌లో అధికారిని తప్పించిన ఎస్పీ

తిరుపతి (నేరవిభాగం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత కొంతకాలంగా పీజీఆర్ఎస్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో ఆ పోలీసు ఉన్నతాధికారి కొంత దురుసుగా వ్యవహరిస్తున్నారు. వారిని నిలబెట్టి మాట్లాడిస్తున్నారు. వారితో సౌమ్యంగా మెలగడం మరచి, అమర్యాదగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులు పెరిగాయి. దీనిపై విచారించిన ఎస్పీ సుబ్బరాయుడు.. పీజీఆర్ఎస్ విధుల నుంచి ఆ అధికారిని పక్కన పెట్టారు. మరో అధికారిని సోమవారం నియమించారు. జిల్లా పోలీసు కార్యాలయానికి ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తున్న ఫిర్యాదుదారుల పట్ల మానవత్వంతో వ్యవహరించుకుంటే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ ఆదేశించారు. ఫిర్యాదుదారులతో పోలీసు అధికారుల మాట తీరు, ప్రవర్తనపై ఎస్పీ దృష్టి పెట్టారు. ఫిర్యాదుదారులతో అధికారులు ఎలా మెలగుతున్నారు? కౌంటర్ల వద్ద ఉన్న సీఐలు, సిబ్బంది వద్దకు వచ్చే అర్జీదారులతో వారెలా ప్రవర్తిస్తున్నారు? సమస్యలపై ఎలా స్పందిస్తున్నారనే దానిపై నిఘా పెట్టారు. అవసరమైతే ఎస్పీ సిబ్బంది నేరుగా ఫిర్యాదుదారులతో మాట్లాడి అధికారుల పనితీరుపై ఆరా తీస్తున్నారు. ప్రత్యేక నివేదికను ఎస్పీకి అందచేస్తున్నారు. ఈ క్రమంలోనే పీజీఆర్ఎస్ విధుల నుంచి ఆ అధికారిని తప్పించినట్లు తెలిసింది. దీంతో మిగతావారి ప్రవర్తనలోనూ మార్పు వచ్చినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. కాగా, గత రెండ సోమవారాలు పోలీసు పీజీఆర్ఎస్ వాయిదా పడింది. దీంతో ఈ సోమవారం దాదాపు 123 మంది ఎస్పీ కార్యాలయానికి వచ్చి తమ బాధలను వివరించారు. దివ్యాంగుల వద్దకే ఎస్పీ వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, రామకృష్ణ, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

7న డిప్యూటీ సీఎం తిరుపతి రాక

మంగళం, నవంబరు3(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం, అటవీశాఖమంత్రి పవన్‌కల్యాణ్ 7, 8 తేదీలలో మామండూరు, పలమనేరులో పర్యటించనున్నారు. ఎర్రచందనం గోదామును పరిశీలించనున్నారు. ఎర్రచందనం ప్రొటెక్షన్‌పై జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించనునానరు.

ఆలయాల్లో కార్తీక పౌర్ణమి ఏర్పాట్లు



ఎస్వీ డెయిరీఫామ్ వద్ద భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయం



తొండవాడలోని అగస్త్యేశ్వరాలయం

చంద్రగిరి,తిరుపతి రూరల్,రామచంద్రపురం,తిరుచానూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శివాలయాలు బుధవారం కార్తీక పౌర్ణమి పూజలకు సిద్ధమవుతున్నాయి. ఇందుకు స్థానికంగా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ●తొండవాడలో అగస్త్యేశ్వరాలయంలో ఆరోజు తెల్లవారుజామున అగస్త్య మహామునికి అభిషేకం జరుగుతుంది. స్వామి అమ్మవార్లకు అభిషేకించాక 4 గంటల నుంచి సర్వదర్శనం కల్పించనున్నారు. రాత్రి 7 గంటలకు నందీ వాహనంపై స్వామి అమ్మవార్లు ఊరేగించనున్నారు. స్వర్ణముఖినదిలో మహిళలు స్నానాలకు, దీపారాధనకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈఆలయం చంద్రగిరి నుంచి 3 కిలోమీటర్లు, తిరుపతి నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉంది. ●చంద్రగిరిలోని ఆర్ఎఫ్ రోడ్డులోని శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయంలో ఉదయం 4 గంటలకు రుద్రాభిషేకం, 7 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం అనంతరం గ్రామోత్సవం నిర్వహించనున్నారు. సాయంత్రం ముత్యాల అలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించనున్నారు. రాత్రికి దీపారాధన జరుగుతంది. ఆలయం తిరుపతికి 13 కిలో మీటర్ల దూరంలో ఉంది. ● తుమ్మలగుంట మార్గంలో టీటీడీ ఎస్వీడెయిరీ ఫామ్ ఎదురుగా భ్రమరాంబిక మల్లికార్జునస్వామి వారి ఆలయంలో ఉదయం 4-6గంటలవరకు స్వామివారికి ప్రత్యేక రుద్రాభిషేకం, అలంకరణ, నైవేద్యం, మహామంగళహారతి నిర్వహిస్తారు. ఉదయం 6-9గంటలవరకు సర్వదర్శనం కల్పిస్తారు. అర్చన, తీర్థప్రసాద వితరణ ఉంటుంది. , రాత్రి 7-730గంటల వరకు జ్వాలాతోరణం(శిఖరదీపం), జ్వాలాహారతి, రాత్రి 9గంటలకు ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వహిస్తారు. తుమ్మలగుంట నుంచి టీటీడీ ఎస్వీడెయిరీఫామ్‌కి వెళ్లే రహదారి మార్గం, తిరుపతి-చంద్రగిరి రహదారిలో ఎస్వీయూ నుంచి ఐకానిక్‌బ్రిడ్జి మీదుగా ఎల్ఎస్‌నగర్ నుంచి ఈఆలయానికి చేరుకోవచ్చు.



కామాక్షి సమేత కోటిలింగేశ్వరాలయం

●తిరుపతి-పచ్చికాపలం మార్గంలో రాయలచెరువు కంట కింద జలకంఠేశ్వరాలయంలోని కోటిలింగేశ్వరాలయం అభిషేకాలు, హోమాలు జరుగుతాయి. ఉత్సవమూర్తులను ఊరేగించాక కార్తీక దీపారాధన ఉంటుంది. ●యోగిమల్లవరంలోని కామాక్షాంబ సమేత పరాశరేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం 4గంటలకు అన్నాభిషేకం నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందిలేకుండా ఏర్పాట్లు చేపట్టారు. కాగా కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా భక్తులు దీపాలు వెలిగించారు.



చంద్రగిరిలోని శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయం



శ్రీపరాశరేశ్వరస్వామి ఆలయం

రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలకు జ్యోత్స్న ఎంపిక



జ్యోత్స్నను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాకాల, నవంబరు 3(ఆంధ్ర జ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని హిస్టరీ బిహైండ్ మేకింగ్ ఇండియన్ కాన్స్టిట్యూషన్ అనే అంశంపై నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో మొగరాల జడ్పీహైస్కూల్ విద్యార్థిని జ్యోత్స్న ప్రథమస్థానం సాధించారు. ఈమె రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సుమలత తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో జ్యోత్స్నను ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.వెంకటసిద్దులు, రామ్మూర్తి, సుల్తాన్, ఆదికేశవులు నాయుడు, విమల విక్టోరియా తదితరులు పాల్గొన్నారు.

దోబీఘాట్ భూమిని కాపాడాలని నిరసన



ర్యాలీగా వస్తున్న రజకులు, సీఐటీయూ నాయకులు

తిరుపతిరూరల్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): వేదాంతపురం పంచాయతీ సర్వేనంబరు 214లోని దోబీఘాట్ భూమిని ఆక్రమణదారుల నుంచి కాపాడాలని కోరుతూ ఏపీ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో పలువురు రజకులు దుస్తులను ఉతికి నిరసన తెలిపారు. అంతకముందు రాస్‌కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నెత్తిన బట్టలు పెట్టుకుని ర్యాలీగా చేరుకున్నారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జయచంద్ర, రజకవృత్తిదారులసంఘ జిల్లా అధ్యక్షుడు మునిరత్నం మాట్లాడుతూ. దోబీఘాట్లకోసం గతంలో ప్రభుత్వం 56సెంట్ల భూమిని కేటాయించిందన్నారు. అప్పట్లో కొందరు రజకులపై దాడిచేసి భూమి తమదని అడ్డుకున్నారన్నారు. న్యాయస్థానం రజకులకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని, పలుమార్లు విన్నవించినా రజకులకు న్యాయం జరగలేదన్నారు. దీనిపై తహసీల్దార్ రామాంజులనాయక్ మాట్లాడుతూ..స్థానిక రెవెన్యూ అధికారుల నేతృత్వంలో భూమిని సర్వే చేస్తామన్నారు. సీపీఎం రూరల్ కార్యదర్శి సుమన్, నాయకులు చిన్నబాబు, మధు, సురేంద్ర, భాస్కర్, రమణ, రాజశేఖర్, మహిళలు పాల్గొన్నారు.

మయూర, సింహ వాహనాలపై దర్శనం



చందన అలంకరణలో మల్లేశ్వరస్వామి - మయూర వాహనంపై దర్శనమిస్తున్న స్వామి

చంద్రగిరి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తొండవాడలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం మయూర వాహనం, రాత్రి సింహ వాహనంపై స్వామి అమ్మవార్లు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం వివిధ రకాల అభిషేకాలానంతరం విభూది అలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం వల్లీదేవసేన, సుబ్రమణ్యంస్వామి ఉత్సవమూర్తులను మయూర వాహనంపై అదిష్ఠింపజేసి ఊరేగించారు. తర్వాత వినాయకస్వామికి అభిషేకం చేశారు. రాత్రి 7 గంటలకు స్వామి అమ్మవార్లను సింహ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు. చంద్రగిరిలోని శ్రీశ్యామలాంబ సమేత మల్లేశ్వరాయంలో ఉదయం స్వామి రుద్రాభిషేకం చేసి, విభూది అలంకరణ చేసారు. సాయంత్రం చందనాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. శైవాంగ పండితులు శివకుమార్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

నేడు విశ్వశాంతి పూజలు

పాకాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉప్పరపల్లె పంచాయతీ సూరినేని వారిపల్లె శివాలయంలో విశ్వశాంతిని కాంక్షిస్తూ మంగళవారం, బుధవారం పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మెన్ సూరినేని బుజ్జిబాబునాయుడు తెలిపారు. మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు గణపతి పూజ, కంకణధారణ,పుణ్యావచనం,గోపూజ, కలశస్థాపన, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లలితా పరమేశ్వరీ దేవి, లక్ష కుంకుమార్చన, అన్నాభిషేకం,అన్నప్రసాదవితరణ, సాయంత్రం జ్యోతిర్లింగ సహస్ర దీపాలంకరణ కార్యక్రమాలుంటాయి. ఎమ్మెల్యే పులివర్తి నాని పట్టువస్త్రాలను సమర్పిస్తారు. బుధవారం రుద్రాభిషేకం, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, అన్నప్రసాద వితరణ చేస్తారని బుజ్జిబాబునాయుడు వివరించారు.

భూ రీసర్వే పక్కాగా చేయండి

రామచంద్రాపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూ రీసర్వే పక్కాగా చేయాలని తహసీల్దారు మధుసూదన్‌రావు కోరారు. కమ్మపల్లి భూరీసర్వే పనులను ఆయన సోమవారం తనిఖీ చేశారు. కమ్మకండ్రిగ భూరీసర్వేకు రైతులకు నోటీసులు అందలేదని ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఎక్కడా తప్పులు దొర్లకుండా సర్వే చేయాలని సూచించారు.

లోతైన జలపాతాల్లో కార్తీక స్నానాలకు వెళ్లొద్దు

దక్కిలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం నేపథ్యంలో చెరువులు, కాలువలు, జలపాతాల వద్ద స్నానాలకు వెళ్లే భక్తులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. సోమవారం ఆయన మండల పరిధిలోని తెలుగుగంగ కాలువతో పాటు అన్ని చెరువులు, వాగులు, కుంటల వద్ద ప్రజలను అప్రమత్తం చేసేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. కార్తీక స్నానాల పేరుతో లోతైన జలపాతాల్లో దిగితే ప్రమాదాల బారిన పడితే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలను చెరువుల వద్దకు తీసుకువెళ్లవద్దని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం దేవుని వెల్లంపల్లిలోని స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయానికి వెళ్లి భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వాహకులకు సూచనలిచ్చారు.

అమ్మవారిసేవలో జస్టిస్ జ్యోతిర్మయి



తిరుచానూరు,నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని సోమవారం ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ జ్యోతిర్మయి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద అధికారులుస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

గ్యాస్ ప్లాంట్ పనులు త్వరగా పూర్తిచేయాలి

తిరుమల, నవంబరు3(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఐఓసీఎల్ ప్లాంట్ పనులను త్వరగా పూర్తి చేయాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. పద్మావతి అతిథిగృహంలో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. తొలుత పీఏసీ-5పై చర్చించారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ.. ఏపీసీ-5లో వేడి నీటి కోసం సోలార్ ప్యానల్ ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలన్నారు. స్టెయిన్‌లెస్ స్టీల్ పాదరక్షల ర్యాక్‌లు ఏర్పాటు చేయాలన్నారు. లాకర్లు, హాల్స్, కల్యాణకట్ట, మెడికల్ సౌకర్యాలు, అన్నప్రసాద వివరాలు రిసెప్షన్ విభాగం సమన్వయంతో డైనమిక్ ఇన్ఫర్మేషన్ రూపంలో పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్ ద్వారా ప్రకటించాలన్నారు. భక్తుల భద్రత కోసం విజిలెన్స్ విభాగం తగినంత సిబ్బందిని నియమించాలని, సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం రెండో ఘాట్‌రోడ్డు బీటీ కోటింగ్ పనులపై కొన్ని సూచనలు చేశారు. కొండలపై నుంచి పడే వర్షపు నీటి వల్ల అక్కగార్ల ఆలయం వద్ద భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. ఆ నీటిని కల్వర్టుల ద్వారా అడవిలోకి మళ్లించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



ఖాజా మహ్మద్ మృతదేహం

నగరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతిలోని బైరాగిపట్టెడకు చెందిన ఎస్. ఖాజా మహ్మద్.. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. స్నేహితురాలితో కలిసి బైక్‌పై చెన్నై బంధువుల పెళ్లికి వెళ్లి తిరిగి తిరుపతికి బయల్దేరాడు. సోమవారం ఉదయం 5.15 గంటలకు నగరి మున్సిపల్ పరిధిలోని నెత్తంకండ్రిగ వద్దకొచ్చేసరికి బైక్ బారికేడ్‌ను ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. బాధితులను నగరి ఏరియా ఆస్పత్రికి స్థానికులు తరలించారు. ఖాజా మహ్మద్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆధునిక వసతులతో శెట్టిపల్లి లే అవుట్

● వ్యవసాయదారులకు ప్లాట్లు కేటాయిస్తాం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లి లేఅవుట్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో అధికారులతో వర్చువల్ విధానంలోసమీక్షించారు.ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ శెట్టిపల్లి భూముల సమస్యలకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందని ఆధునిక మౌలిక సదుపాయాలతో శెట్టిపల్లి లేఅవుట్ నిర్మాణం జరుగుతుందన్నారు. అర్హులైన వ్యవసాయదారులకు ప్లాట్లుకేటాయించబడుతాయన్నారు. త్వరలోనే లబ్ధిదారులకు పట్టాలు పంపిణీచేయడానికి ఏరాపట్లు చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, డీఆర్వో రామ్మోహన, జిల్లా ల్యాండ్ అండ్ సర్వే అధికారి అరుణ్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్‌శ్రీరామ్‌కుమార్ తదితరులుపాల్గొన్నారు.

భూగర్భ జలాలను కాపాడుకుందాం: నాని



ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న నాని

భాకరాపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వర్షపు నీరు వృథాగా పోకుండా కాపాడడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. దేవరకొండ పంచాయతీ వంగుమళ్లవారిపల్లె సమీపంలో తూముకుంట చెరువు గండిని పూడ్చి వేయాలని ఆయన ఆదేశించారు. ఇరిగేషన్ అధికారులు ఆదివారం గండిని పూడ్చివేశారు. ఈక్రమంలో ఎమ్మెల్యే సోమవారం తూముకుంట చెరువును పరిశీలించారు. చెరువు కట్ట మరమ్మతుల ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు.. అనంతరం మల్లెలవాండ్లపల్లెలోని డ్రైనేజీ పరిశీలించారు. ఆయన వెంట పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, ఆర్వీ రమణారెడ్డి, మోహన్ రెడ్డి, మదనమోహన్, సుబ్రహ్మణ్యం, వెంకటరత్నం, మునస్వామినాయుడు, మల్లిఖార్జునరెడ్డి, తహసీల్దారు భాగ్యలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, ఇరిగేషన్ డీఈ సురేశ్, ఏఈ గిరీశ్, తదితరులు పాల్గొన్నారు.

తలకోనలో ఘనంగా కార్తీక పూజలు



ఎర్రావారిపాలెం, నవంబరు3 (ఆంధ్రజ్యోతి); తలకోన సిద్ధేశ్వర స్వామి ఆలయంలో కార్తీక సోమవారం పూజలు ఘనంవగా జరిగాయి. ప్రధాన ఆలయంలో అభివృద్ధి పనుల నేపథ్యంలో బాలాలయ శివాలయంలో స్వామి వారికి అభిషేకం చేశారు. జలపాతం ఉధృతంగా ప్రవహిస్తుండంతో భక్తుల భద్రత దృష్ట్యా అధికారులు జాగ్రత్తలు తీసుకొన్నారు. ఫారెస్టు అధికారులు. ప్రధాన ఆలయం వెలుపల నందీశ్వరునికి పూజలు చేశారు. ఈఓ రవీంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

సుందరరాజ స్వామికి తిరుచ్చి ఉత్సవం



తిరుచానూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సుందరరాజస్వామికి వేడుకగా సోమవారం తిరుచ్చి ఉత్సవం జరిగింది. స్వామివారి జన్మనక్షత్రం ఉత్తరాబాధ్ర పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవర్లకు నేత్రపర్వంగా అభిషేకం చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత సుందరరాజస్వామి బంగారు తిరుచ్చిపై మాడవీధుల్లో ఊరేగారు. డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్‌పాల్గొన్నారు.

ఎస్వీయూ రెక్టార్‌కు అభినందన



ప్రొఫెసర్ అప్పారావును అభినందిస్తున్న తిప్పారెడ్డి

తిరుపతి రూరల్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ రెక్టార్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావుని సోమవారం అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్ ఛైర్మన్ డాక్టర్ ఆర్.తిప్పారెడ్డి మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. ఈసందర్భంగా తిప్పారెడ్డి మాట్లాడుతూ.. పరిపాలన, అకడమిక్ రంగాలలో విశేషానుభవం, ఉన్నతవ్యక్తిత్వం ఉన్నవారిని నియమించడం సంతోషంగా ఉందన్నారు. మంత్రి లోకేష్, ఉన్నతవిద్యా మండలి ఛైర్మన్ మధుమూర్తిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బిజయకుమార్ బెహరా, సెక్రటరీ ఆర్.లక్ష్మీప్రశస్త పాల్గొన్నారు.

జలకంఠేశ్వరస్వామికి తిరుమంజనం

రామచంద్రాపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాయలచెరవుకట్ట భవానీ జలకంటేశ్వరస్వామితోపాటు, కామాక్షి సమేత కోటిలింగేశ్వరస్వామివారికి కార్తీక సోమవారం సందర్భంగా వైభవంగా తిరుమంజనం జరిగింది. ఆలయంలో విశేష పూజల అనంతరం ప్రత్యేక అలంకరణ చేపట్టారు. సాయంత్రం పుష్కరణి వద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ నిర్వాహకులు మురళీకృష్ణ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు.

సీఏఆర్ఏ పోస్టర్ల ఆవిష్కరణ

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్ సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ(సీఏఆర్ఏ) పోస్టర్లను విడుదల చేశారు. పిల్లలు మనలో ఒక భాగమని, వారి చిరునవ్వులు, ఆటలు ఎంతో ఆనందాన్ని ఇస్తాయన్నారు. కొందరు పిల్లలుప్రత్యేక అవసరాలతో జన్మించి సమాజంలో వారికి సమాన అవకాశాలు లేకపోవడం బాధాకరమన్నారు. సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ ద్వారా అలాంటి పిల్లలను చట్టబద్ధంగా దత్తత తీసుకోవడం సాధ్యమేనన్నారు. నవంబరును ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల అడాప్షన్ నెలగా ప్రకటించారన్నారు. ఇద్దరు, అంతకంటే ఎక్కువమంది పిల్లలున్న దంపతులు ఈ పిల్లలను దత్తత తీసుకోవడానికి అర్హులన్నారు. ఐసీడీఎస్ పీడీ పీడీ వసంతబాయి, వసంత, డీసీపీవో శివశంకర్,మిషన్ వాత్సల్య సిబ్బంది పాల్గొన్నారు.

మా స్థలాన్ని ఆక్రమించే యత్నం

● కలెక్టరేట్ ఎదుట పెట్రోల్ పోసుకున్న మహిళలు



పోలీసుల సమక్షంలో పెట్రోల్ పోసుకుంటున్న లక్ష్మీదేవమ్మ

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'మా స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. వాళ్లకే అధికారులు, పోలీసులు అండగా నిలుస్తున్నారు. ఇల్లు కట్టుకోనీయకుండా మమ్మల్ని వేధిస్తున్నారు. మాకిక చావే శరణ్యం' అంటూ సోమవారం కలెక్టరేట్ ఎదుట బాధితురాలు వెంకటసుబ్బమ్మ, ఆమె చెల్లెలు లక్ష్మీదేవి, కుమార్తె భారతి ఒంటిపైన పెట్రోల్ పోసుకోవడం కలకలం రేగింది. బాధితులు తెలిపిన ప్రకారం.. తిరుపతి నగరం సంజయ్‌గాంధీ కాలనీకి చెందిన సర్వే నెంబరు 12లో బండి వెంకటసుబ్బమ్మకు 90 అంకణాల స్థలం ఉంది. 40 ఏళ్లగా నివాసం ఉంటున్నారు. 1990లో తిరుపతిలోని ఓ మద్యం వ్యాపారి ఆ స్థలం తనదని రాగా కోర్టు తప్పుపట్టడంతో వెళ్లిపోయాడు. ఆ తర్వాత గోపీకృష్ణ అనే వ్యక్తి తప్పుడు డాక్యుమెంట్లతో రెవెన్యూ, మున్సిపల్ అధికారులను మాపైకి పంపాడు. అన్ని కోర్టులలో మాకు అనుకూలంగా తీర్పు వచ్చింది. ఇప్పుడున్న రేకుల షెడ్‌ను తొలగించి ఇంటిని కట్టుకునేందుకు అప్రూవల్‌కు మున్సిపాలిటీకి రూ.75వేల చలానాకూడా కట్టాం. ఇల్లు నిర్మించే క్రమంలో ఆదివారం పోలీసులు వచ్చి మమ్మల్ని బెదిరించి స్టేషన్‌కు రావాలన్నారు. మున్సిపాలిటీ వాళ్లల ఫోను చేసి బెదిరిస్తున్నారు. ఓ టీడీపీ నేత వద్ద గోపీకృష్ణ పనిచేస్తున్నాడని.. అతడి రాజకీయ అండతో తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ లక్ష్మీదేవి, భారతి పెట్రోల్ పోసుకున్నారు. డీఆర్వో వెళ్లి నచ్చచెప్పి కలెక్టరేట్‌కు తీసుకెళ్లారు. వారి సమస్యలపై దృష్టిపెట్టాలని ఆర్డీవో రామ్మోహన్‌ను కలెక్టర్ ఆదేశించారు. బాధితులిద్దరూ ఒకరి తర్వాత ఒకరు పెట్రోల్ పోసుకుంటున్నా విధుల్లోని పోలీసులు వారించకపోవడం విమర్శలకు తావిచ్చింది. సీఐ చేరుకుని సముదాయించారు.

సురక్షిత ప్రయాణంపై దృష్టి సారించండి



ప్రైవేటు బస్సు ఆపరేటర్లకు సూచనలు మురళీమోహన్

తిరుపతి(రవాణా), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సురక్షిత ప్రయాణంపై బస్సు ఆపరేటర్లు తగు జాగ్రత్త వహించాలని డీటీవో కొర్రపాటి మురళీమహన్ అన్నారు. తిరుపతిలోని జిల్లా రవాణా శాఖకార్యాలయంలో సోమవారం ఆయన కాంట్రాక్టు క్యారేజీ బస్సు ఆపరేటర్లతో సమావేశమయ్యారు. రవాణాశాఖ నియమ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గతవారంరోజుల్లో నిబంధనలు ఉల్లంఘించిన 13 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, 50 వాహనాలపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు సుబ్రహ్మణ్యం, మోహన్‌కుమార్, ఆంజనేయప్రసాద్,అతికానాజ్, ఏఈవో విజయకుమార్, యువకిశోర్, ప్రైవేట బస్సు ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు రూపేష్‌కుమార్, కార్యదర్శి ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మోక్షదాయకం.. కపిలేశ్వరుడి దర్శనం

- 5న కార్తీక పౌర్ణమినాడు అన్నాభిషేకం
- కట్టిపడేసే జలపాతం అందాలు

తిరుపతి(కల్చరల్), నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో ప్రసిద్ధ శైవక్షేత్రంగా బాసిల్లుతున్న కపిలేశ్వరుడి దర్శనం మోక్షదాయకంగా భావిస్తారు. ఈ ఆలయంలో శివలింగాన్ని కపిలముని ప్రతిష్ఠించడంతో కపిలేశ్వరుడిగా పరమేశ్వరుడు ఇక్కడ పూజలందుకుంటున్నారు. ఈ ఆలయంలో శేషాచల కొండకోనల నుంచి జాలువారే జలపాతం అందాలు కట్టిపడేస్తాయి. కార్తీక మాసంలో ఈ జలపాతం, పుష్కరిణిలో పుణ్య స్నానాలు అచరించి శివుడిని దర్శనం చేసుకుంటే సకల శుభాలు కలుగుతాయనే నమ్మకం భక్తులది. అందుకే ఎక్కువ సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ప్రధానంగా అయ్యప్ప భక్తులు ఉదయం, సాయంత్రం స్నానాలకు రావడం అనవాయితీగా వస్తోంది. అయితే ఈసారి మొంథా తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు జలపాతం ప్రమాదస్థాయిలో ఉండడంతో స్నానాలకు అనుమతించకుడా ఆంక్షలు విధించారు.


కొండల నుంచి వస్తున్న జలపాతం

అలాగే దీపాలను కూడా అలయానికి బయట జంగిల్ బుక్‌లో పెట్టుకునేలా ఏర్పాటు చేశారు. ఇక కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 5వ తేదీన ఆలయంలో విశేష పూజలు నిర్వహించనున్నారు. ఈశ్వరుడికి అన్నాభిషేకం నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. ఈ అభిషేక దర్శనంతోపాటు ప్రసాదంగా ఇచ్చే అన్నాన్ని స్వీకరిస్తే సకల రోగ నివారణ, పాపాలు హరించుకుపోతాయనే విశ్వాసం భక్తులది.

పౌర్ణమినాడు కార్యక్రమాలు ఇలా..

పౌర్ణమినాడు తెల్లవారుజామున 2 గంటలకు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి అభిషేకాలు, పూజలు చేస్తారు. మధ్యాహ్నం 12నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏకాంతంగా అన్నాభిషేకం చేయనున్నారు. ఈ సమయంలో భక్తులకు దర్శనానికి అనుమతి ఉండదు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు అన్నలింగ దర్శనం భక్తులకు కల్పిస్తారు. అనంతరం అన్నలింగ ఉద్వాసన ఏకాంతంగా జరుగుతుంది. తర్వాత ఆలయాన్ని శుద్ధిచేసి 7.30 నుంచి 8.30గంటల వరకు ఏకాంతంగా సుగంధద్రవ్య అభిషేకం ఉంటుంది. ఈ సమయంలో భక్తులకు అభిషేక అన్నప్రసాదాన్ని పంపిణీ చేస్తారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశముండటంతో అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ, ఏర్పాట్లు చేస్తున్నారు.


కనువిందు చేస్తున్న కపిలేశ్వరాలయం

శెట్టిపల్లి భూముల అభివృద్ధికి శ్రీకారం


భూమిపూజ చేస్తున్న తుడా చైర్మన్

తిరుపతి అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన శెట్టిపల్లి భూముల్లో జంగిల్ క్లియరెన్స్, సరిహద్దు గుర్తింపు పనులకు సోమవారం తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, శ్రీకారం చుట్టారు. దీంతో స్థిరీకరణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో ఇక్కడ జరిగే టౌన్‌షిప్ ప్రాజెక్టుకు ఇది తొలి అడుగుగా నిలుస్తుందన్నారు.

పశువుల కాపరిపై యజమాని దాడి

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పశువుల కాపరిపై యజమాని దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. అలిపిరి ఎస్ఐ నాగార్జున రెడ్డి వివరాల మేరకు.. స్థానిక రవీంద్రనగర్‌కు చెందిన కొల్హాపూరి గేదెలు పెంచుతూ పాల వ్యాపారం చేస్తున్నాడు. అతని వద్ద చిత్తూరుకు చెందిన వ్యక్తి పనిచేస్తున్నాడు. పశువుల కోసం కసువు సరిగా కోయలేదనే విషయమై ఆదివారం ఇద్దరూ గొడవపడ్డారు. ఆగ్రహానికి గురైన కొల్హాపూరి అతని ముఖంపై రాళ్లతో కొట్టాడు. కంటిపై తీవ్ర గాయమైంది. కుమారుడు వాసు అతన్ని ఆసుపత్రిలో చేర్పించాడు. అలిపిరి స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నాడు.

తిరుమల తరహాలో.. తిరుచానూరు బ్రహ్మోత్సవాలకు భద్రత


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల తరహాలో తిరుచానూరు పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భద్రత కల్పించాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. అదే సమయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన ఉన్నందున అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సోమవారం జిల్లా పోలీసు కమాండ్ కంట్రోలు యూనిట్‌లో పోలీసు అధికారులతో ఆయన సమావేశమయ్యారు. భక్తుల భద్రత, సౌకర్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వాహనాల పార్కింగ్, శక్తి టీమ్ పర్యవేక్షణ, మహిళా భక్తుల రక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, రామకృష్ణ, నాగభూషణరావు, శ్రీనివాసరావు, డీఎస్పీలు వెంకటనారాయణ, భక్తవత్సలం, ప్రసాద్, రామకృష్ణమాచ్చారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దుకాణం కోసం ఇరువర్గాల ఘర్షణ

- పరస్పరం కేసుల నమోదు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలో దుకాణం విషయమై ఇరువర్గాలు గొడవపడ్డాయి. సీఐ చిన్న గోవిందు వివరాల మేరకు.. గాంధీపురం పంచాయతీలో 2017లో తిరుపతికి చెందిన యశోద రాజేశ్వరరావు దగ్గర దుకాణాన్ని బాడుగకు తీసుకుంది. అక్కడ ఎల్‌వీ పవర్ లూమ్స్ పెట్టుకుని వ్యాపారం చేసేది. అద్దె సకాలంలో ఇవ్వడం లేదని ఏడాది క్రితం బలవంతంగా ఖాళీ చేయించారు. ఆమె కోర్టుకు వెళ్లడంతో కేసు నడుస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం రాజేశ్వరరావు వద్ద రెంటల్ అగ్రిమెంటు చేసుకున్న రత్నమ్మ వెళ్లి షాపు శుభ్రం చేస్తుండగా యశోద అడ్డుపడింది. ఇరువురు ఘర్షణపడ్డారు. రత్నమ్మ వెంట వచ్చిన కొందరు యశోదపై దాడి చేశారు. యశోద ఫిర్యాదు మేరకు ఎస్ఐ షేక్ షావలి కేసు నమోదు చేశారు. ఇదే ఘటనలో యశోద, ఆమె అనుచరులు కలసి రత్నమ్మను కొట్టి గాయపరిచారు. తనపై దాడి చేయడమేగాక కులం పేరుతో దూషించారని రత్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు యశోదపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

అంగన్వాడీ కేంద్రాలకు డిజిటల్ వేయింగ్ మిషన్లు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేసేందుకు టాటా ట్రస్టు సహకారంతో విజయవాహిని చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు రూ.9 లక్షలు విలువైన 734 వెయింగ్ మిషన్లను కలెక్టర్ వెంకటేశ్వర్‌కు సోమవారం అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ మిషన్లు పిల్లలు, గర్భిణుల పోషకాహార స్థితిని తెలుసుకోవడానికి ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువన్సీ, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, టాటాట్రస్టు జిల్లా ప్రోగ్రాం అధికారి అమరావతి పాల్గొన్నారు.

టీటీడీకి విరాళంగా ఎలక్ట్రికల్ బైక్‌లు


వాహనాలను విరాళంగా అందజేస్తున్న దాత

తిరుమల, నవంబరు3(ఆంధ్రజ్యోతి): టీటీడీకి సోమవారం మూడు ఎలక్ట్రికల్ ద్విచక్రవాహనాలు విరాళంగా అందాయి. ధర్మవరానికి చెందిన వేణు మోటర్స్ సీఈవో వేణుగోపాల్ 1.53 లక్షల విలువైన బైక్‌లను విరాళంగా ఇచ్చారు. ఆలయ ఏఈవో మోహన్ రాజు, ట్రాన్స్‌పోర్టు కార్యాలయ ఇంచార్జ్ హరిబాబుకు వాహనతాళాలు, పత్రాలను అందజేశారు.

వ్యాస రచన పోటీలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగంలో వ్యాస రచన పోటీలను నిర్వహించనున్నారు. రచయిత్రి ఓల్గా తండ్రి పోపూరి వెంకట సుబ్బారావు స్మారకోపన్యాస కార్యక్రమం సందర్భంగా 'సాహిత్య సృజన ద్వారా రచయిత్రులు అందిస్తున్న విలువలు' అంశంపై కాలేజీ, యూనివర్సిటీ స్థాయి విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహిస్తారు. ఎంపికైన ఉత్తమ వ్యాసానికి 27న రూ.10 వేల నగదు బహుమతి అందించనున్నారు. ఈ నెల 11 లోపు 10 పేజీల్లో వ్యాసాన్ని 'డాక్టర్ డి. యువశ్రీ, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, పద్మావతి మహిళా యూనివర్సిటీ, తిరుపతి అనే చిరునామాకు పంపవలసి ఉంటుంది. వివరాలకు 98859 40011 ఫోన్ నంబరులో సంప్రదించాలని డాక్టర్ యువశ్రీ కోరారు.

ఏపీఆర్‌సెట్ పరీక్షల ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశానికి ఏపీఆర్‌సెట్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పద్మావతి మహిళా యూనివర్సిటీ ఈ పరీక్షలను నిర్వహిస్తోంది. ఏపీఆర్‌సెట్ కన్వీనర్‌గా బయో టెక్నాలజీ ప్రొఫెసర్ ఉష, కో-కన్వీనర్‌గా ప్రొఫెసర్ జాన్ సుష్మా వ్యవహరిస్తున్నారు. పరీక్షల కోసం ఏపీలో 13, తెలంగాణలో ఒక కేంద్రాలు ఏర్పాటయ్యాయి. పరీక్షలను యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెన్నం ఉమ ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని, కన్వీనర్ ఉష, కో-కన్వీనర్ జాన్ సుష్మా పాల్గొన్నారు. 5,752 మంది దరఖాస్తు చేసుకోగా తొలి రోజు 90 శాతం మంది హాజరయ్యారు.

శాస్త్రీయ నైపుణ్యాలపై విద్యార్థులకు శిక్షణ


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిపుణులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పద్మావతి యూని వర్సిటీలోని ఉమెన్ బయోటెక్ ఇన్క్యుబేషన్ ఫెసిలిటీ సెంటర్‌లో పాఠశాల స్థాయి విద్యార్థులకు శాస్త్రీయ నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్నారు. సోమవారం ప్రారంభమైన ఈ శిక్షణ ఈనెల 7వ తేదీ వరకు కొనసాగనుంది. పీఎం-ఉష ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ వాణి నేతృత్వంలో అధ్యాపకులు విద్యావతి, శోభ, నీలకంఠయ్య విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కాలేజీలో మొదటి సంవత్సర విద్యార్థులను ఎన్‌సీసీ క్యాడెట్లుగా ఎంపిక చేశారు. 300 మందిని పరీక్షించి, 63 మందిని ఎంపిక చేశారు. ప్రిన్సిపాల్ నారాయణమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

టీమిండియా విజయంపై సంబరాలు


కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకుంటున్న మేయర్ శిరీష

తిరుపతి(జీవకోన), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారత మహిళల క్రికెట్ జట్టు వరల్డ్ కప్ గెలిచి, విశ్వవిజేతగా నిలవడంపై మేయర్ డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వైసీపీ మహిళా నేతలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



తిరుపతి (నేర విభాగం), నవం బరు 3 (ఆంధ్ర జ్యోతి) రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం తిరుపతిలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రవి వివరాల మేరకు... తిరుపతి రైల్వేస్టేషన్‌కు రెండు కిలోమీటర్ల దూరంలోని హీరోహోండా షోరూం వద్ద ఆఫ్‌లైన్ రైలు పట్టాలపై రేణిగుంట నుంచి తిరుపతికి వస్తున్న గూడ్స్ రైలు కిందపడి 45 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. లోకోపైలెట్ ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. మృతుడు మెరూన్ రెడ్ కలర్ టీ-షర్టు, డార్క్ గ్రీన్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని, వివరాలు తెలిసిన వారు రైల్వే హెడ్ కానిస్టేబుల్ రవి 9440324310కు కాల్ చేసి సమాచారమివ్వాలని కోరారు.

టీడీపీ నేతలపై కేసు కొట్టివేత


కోర్టు ప్రాంగణంలో టీడీపీ నేత నరసింహ యాదవ్, అతని కుటుంబ సభ్యులు

తిరుపతి, నవంబరు3 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికల సందర్భంగా టీడీపీ నేతలపై పెట్టిన కేసును సోమవారం స్థానిక 4వ అదనపు న్యాయస్థానం కొట్టివేసింది. టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్, అతని సోదరుడు, 2వ డివిజన్ ఇన్‌చార్జి రామ యాదవ్, కార్పొరేటర్ అభ్యర్థి శాంతి యాదవ్‌లపై 2021 మార్చి 10వ తేదీన జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో అప్పటి అధికార పార్టీ వైసీపీ కేసులు బనాయించింది. వైసీపీ దొంగ ఓట్లను అడ్డుకుని ఎన్నికల ప్రక్రియను నిరసిస్తూ టీడీపీ నేతలు ఆందోళన చేపట్టారు. దీంతో వారిపై వైసీపీ నేతలు కేసు నమోదు చేయించారు. నాలుగున్నరేళ్ల తర్వాత న్యాయస్థానం కేసును కొట్టివేసింది. ఈ సందర్భంగా నరసింహ యాదవ్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో తిరుపతిలో ఒక్క ఎన్నిక కూడా ప్రజాస్వామ్యయుతంగా జరగలేదన్నారు. అక్రమ కేసులతో ఇబ్బంది పెట్టినా చివరకు న్యాయం గెలిచిందన్నారు. ఈ తీర్పు వైసీపీకి చెంపపెట్టు లాంటిదన్నారు.

సైకాలజీ ఘటనపై విచారణ

ఎస్వీయూ అధికారుల నిర్ణయం


ఆందోళన చేస్తున్న విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ సైకాలజీ విభాగ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఓ ప్రొఫెసర్ సీనియర్ల చేత జూనియర్లను వేధిస్తున్నారని వర్సిటీ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విద్యార్థి సంఘాలు సోమవారం ఆందోళన చేపట్టాయి. ఈ క్రమంలో రెక్టార్ ఛాంబర్ తలుపు అద్దాలు పగిలాయి. స్పందించిన అధికారులు ఘటనపై విచారణకు ఆదేశిస్తున్నట్టు తెలిపారు. ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు చలపతి, అశోక్, మల్లికార్జున, రవి, అక్బర్, సుందర్, శివశంకర్ నాయక్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ చెస్ పోటీలో తిరుపతి బాలిక సత్తా


త్రిపురాంబికను అభినందిస్తున్న మంగోలియా ప్రధాని

తిరుపతి(క్రీడలు), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మంగోలియా రాజధాని ఉలాన్బాతార్‌లో గతనెల 24 నుంచి ఈనెల 2 తేదీ వరకు జరిగిన 19వ ఆసియా స్కూల్స్ బ్లిడ్జ్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలలో తిరుపతికి చెందిన త్రిపురాంబిక సత్తా చాటింది. అండర్ 13 బాలికల విభాగంలో తృతీయస్థానంలో నిలిచి రజత పతకం, ప్రశంసాపత్రం అందుకుంది. రాపిడ్, బ్లిడ్జ్ విభాగాలలో అత్యధిక రేటింగ్ 149 పాయింట్లతో రికార్డు నెలకొల్పింది. ఆ దేశ ప్రధాని గొమ్బోజవ్యిన్‌జందన్‌స్టార్ అభినందించారు. తుడా చైర్మన్, చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దివాకర్‌రెడ్డి, సెక్రటరీ శ్రీనివాససూరి, సీఏవో బాలాజీ అభినందించారు.

పీజీఆర్ఎస్‌కు 33 వినతులు

తిరుపతి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 33 వినతులు వచ్చాయి. ప్రశాంతినగర్ చివర, గోవిందనగర్ వద్ద అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని, వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని, భర్త మరణించాడు నగదు ఇప్పించాలని, తిమ్మినాయుడు పాలెంలో రోడ్లు, డ్రైనేజి కాలువలు నిర్మించాలని, అమిగోస్ అపార్ట్మెంట్‌లో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలు అడ్డుకోవాలని వినతులు వచ్చాయి. దేవేంద్ర థియేటర్ శివాలయం వద్ద రోడ్డుపై ఉన్న గుంత పూడ్చాలని, మునిసిపల్ పార్కు పక్కన పార్క్ చేసిన వాహనాలు తొలగించాలని, గరుడ వారధిపై ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు. సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు డిప్యూటీ కమిషనర్ అమరయ్య తెలిపారు.

డయల్ యువర్ సీఎండీకి 89 ఫిర్యాదులు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సదరన్ డిస్కం పరిధిలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ సీఎండీ కార్యక్రమానికి 89 ఫిర్యాదులు వచ్చాయి. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు, గృహాలు, పాఠశాలలపై విద్యుత్ తీగలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మార్పులాంటి అంశాలపై ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులకు సంబంధించి సాంకేతిక సమస్యలను అధ్యయనం చేసి 15 రోజుల్లో పరిష్కరించడానికి ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశామని సంస్థ సీఎండీ లోతేటి శివశంకర్ తెలిపారు. టీములకు సీజీఎంలు, జీఎంలు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. క్షేత్ర స్థాయిలో దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. సమస్యల పరిష్కారంలో ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఎండీ హెచ్చరించారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను టోల్ ఫ్రీ నెంబర్లు 1912, 18004251555333కి కాల్ చేసి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. 9133331912 నంబరుకు తెలియజేసినా సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్‌ఖాన్, కె.రామమోహనరావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణాదేవి, పి.హెచ్.జానకిరామ్, ఎం.మురళీకుమార్, కె.ఆదిశేషయ్య, ఎం.ఉమాపతి, జీఎంలు జి.చక్రపాణి, డి.సురేంద్రరావు, పి.భాస్కర్‌రెడ్డి, జగదీష్‌లు తిరుపతి ఎస్ఈ వి. చంద్రశేఖర్ రావులు పాల్గొన్నారు.

భారత మహిళా క్రికెటర్ల మాస్కులతో స్ప్రింగ్ డేల్ విద్యార్థినుల సంబరాలు



తిరుపతి(విద్య), నవం బరు 3 (ఆంధ్రజ్యోతి): భారత మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్ సాధిం చిన నేపథ్యంలో స్థానిక కరకంబాడి మార్గంలోని స్ప్రింగ్ డేల్ పాఠశాలలో సోమవారం విజయోత్స వాలు నిర్వహించారు. జాతీయ పతా కాలను ప్రదర్శిస్తూ జయజయధ్వానాలు చేశారు. పాఠశాల విద్యార్థినులు మహిళా క్రికెటర్ల మాస్కులు ధరించి జట్టుకు అభినందనలు తెలిపారు. పాఠశాల అధినేత వాసు మాట్లాడుతూ విశ్వ విజేతలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులందరూ క్రీడల్లో రాణించాలని కోరారు. ప్రిన్సిపాల్ అనురాధ గోపాల్, ఏవో చంద్రశేఖర్, పీఆర్వో సాంబశివారెడ్డి పాల్గొన్నారు.


ఆటోనగర్ సొసైటీ పాలకమండలి సభ్యులు సోమవారం తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డిని కలిశారు. ఆటోనగర్‌లో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని ఈ సందర్భంగా కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.

తిరుమలలో రేపు కార్తీక పౌర్ణమి గరుడసేవ

తిరుమల, నవంబరు3(ఆంధ్రజ్యోతి): తిరుమలలో బుధవారం కార్తీక పౌర్ణమి గరుడసేవ జరుగనుంది. ఆరోజు రాత్రి 7 నుంచి 9 గంటల వరకు మాడవీధుల్లో మలయప్పస్వామిని ఊరేగిస్తారు. కార్తీక మాసంలోని పౌర్ణమి కావడంతో భక్తులు భారీగా వచ్చే అవకాశముందనే అంచనాతో టీటీడీ తగిన ఏర్పాట్లు చేస్తోంది.

వానమామలై జీయర్‌స్వామికి టీటీడీ పెద్ద మర్యాద



తిరుమల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముంగునేరి వానమామలై మఠానికి చెందిన పరమహంసేత్యంతి మధురకవి వానామామలై జీయర్‌స్వామి సోమవారం తిరుమల శ్రీవారిని పెద్ద మర్యాదతో దర్శించుకున్నారు. ఉదయం అఖిలాండం వద్ద టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అర్చకబృందం ఆయనకు ఇస్తికాఫల్ స్వాగతం పలికారు. ఆలయం నుంచి పల్లకీలో తీసుకెళ్లిన శఠగోపాన్ని సమర్పించి ఆహ్వానించారు. అనంతరం టీటీడీ పెద్దజీయర్ మఠానికి స్వామి చేరుకోగా ఈవో మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



శ్రీవారి ఆలయం వద్ద తుషార్ కపూర్

తిరుమల, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. టీడీపీ ఎమ్మెల్యే, విప్ గణబాబు, ప్రభుత్వ మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం, సినీని ర్మాత ఏఎం రత్నం, బాలీవుడ్ నటుడు తుషార్ కపూర్ ఉన్నారు.


సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.51 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,442

తలనీలాలు సమర్పించినవారు: 24,692



నా భర్తను చంపేశారు

- పోలీసులు న్యాయం చేయట్లేదు
- పీజీఆర్ఎస్‌లో ఎస్పీ ఎదుట బాధితురాలి మొర



చంటిబిడ్డతో ఎస్పీని కలిసిన హేమలత

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'నాభర్తను మా అత్త, బావ చంపేశారు. పోలీసు స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదు' అంటూ బాధితురాలు హేమలత ఎస్పీ సుబ్బరాయుడు ఎదుట సోమవారం పీజీఆర్ఎస్‌లో మొర పెట్టుకున్నారు. 'మాది వడమాలపేట మండలం ఎస్‌బీఆర్ పురం. సత్యవేడు మండలం మాదనపాలేనికి చెందిన కృష్ణకుమార్‌తో 2023లో నాకు వివాహమైంది. నా భర్తకు అన్న కిరణ్‌కుమార్, సోదరి అశ్విని ఉన్నారు. ఆ తర్వాత నేను డెలివరీ కోసం పుట్టింటికి వచ్చా. ఆ సమయంలో నా భర్త, అతడి అన్న మధ్య ఆస్తుల తగాదాలు చోటు చేసుకున్నాయి. అనంతరం తరచూ గొడవలు జరిగేవి. మా బావ కిరణ్‌కుమార్‌కు మగ బిడ్డ, ఆడ బిడ్డ ఉన్నారు. మాకు మగ బిడ్డ పుట్టడంతో, ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందన్న ఆక్రోశంతో నా భర్తను అంతమొందించాలని పథకం పన్నారు. ఈ ఏడాది సెప్టెంబరు 12న ఇంట్లో ఉన్న నా భర్తపై అత్త వసంతమ్మ, బావ కిరణ్‌కుమార్ దాడి చేయడంతో మృతిచెందారు. నేను అత్తింటికి వెళ్లేటప్పటికే ఖననం చేశారు. నేను భయపడి పుట్టింటికి వచ్చా. వడమాలపేట పోలీసులకు ఫిర్యాదు చేశా. పోలీసులు కనీసం స్పందించలేదు. ఆ తర్వాత కర్మక్రియలకు వెళ్లగా నాపై నా భర్త మేనమామ కుమారుడు భరత్ కర్రలతో దాడి చేశారు. దీనిపై సెప్టెంబరు 28న ఫిర్యాదు చేశా. న్యాయం చేయాలని పలు సార్లు వడమాలపేట పోలీసులను ప్రాధేయపడినా పట్టించుకోలేదు. చివరకు సెప్టెంబరు 29న కేసు నమోదు చేశారు. ఆ తర్వాత పట్టించుకోలేదు. నా భర్త చనిపోయిన సమయంలో మా అత్త ఇంట్లో ఉన్న నా పదో తరగతి, ఇంటర్ సర్టిఫికెట్లు ఇప్పించాలని పోలీసులను కోరినా ఫలితం లేదు. ఇప్పటికీ నాకు న్యాయం చేయకపోగా పోలీసుల నుంచి ఒత్తిడి ఉంది. పెళ్లి సమయంలో మా అమ్మ వారు పెట్టిన 10 సవర్ల బంగారు నగలు మా అత్త వద్ద ఉన్నాయి. అవి ఇప్పించండం. నాకు న్యాయం చేయండి' అంటూ ఆమె చంటిబిడ్డతో వచ్చి ఎస్పీ సుబ్బరాయుడిని ప్రాధేయ పడ్డారు. దీనిపై విచారించి, న్యాయం చేస్తామని బాధితురాలికి ఎస్పీ హామీ ఇచ్చారు.

మా బాధలు ఆలకించండి

అధికారులకు అర్జీదారుల వేడుకోలు ● కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 403 ఫిర్యాదులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'కలెక్టరేట్ చుట్టూ వారాల తరబడి తిరుగుతున్నా మా సమస్యలు పరిష్కారం కావడం లేదు. మీరైనా మా బాధలు ఆలకించండి మహాప్రభో' అంటూ అర్జీదారులు అధికారులకు మొరపెట్టుకున్నారు. దీపావళి, మొంథా తుఫాన్ కారణంగా గడచిన రెండు వారాలు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించలేదు. దీంతో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎన్నడూ లేని విధంగా 403 అర్జీలు వచ్చాయి. అందులో రెవెన్యూ శాఖకు 262 వినతులు వచ్చాయి. డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

పట్టా ఇచ్చి స్థలం చూపించలేదు



మేము కూలీనాలి చేసుకుని బతుకుతున్నాం. గత వైసీపీ ప్రభుత్వం ఆర్సీపురం మండలం నెన్నూరు వద్ద ఇంటి పట్టా ఇచ్చారు. తీరా స్థలం చూపించలేదు. నాలుగేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. మీరైనా స్పందించి మాకు ప్లాట్ చూపించండి

- గంగ, దామినేడు, తిరుపతి రూరల్ మండలం

పింఛను కోసం రెండేళ్లుగా తిరుగుతున్నా..



నేను ఆటో తోలుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడిని. రెండేళ్ల కిందట ప్రమాదం జరిగి కాలు విరిగింది. నడవలేని స్థితిలో ఉన్నా. అంగవైకల్యం కింద పింఛను మంజూరు చేయాలని కలెక్టరేట్ చుట్టూ తిరుగుతూనే ఉన్నా. ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పటికైనా న్యాయం చేయండి.

- వెంకటాద్రి, రాజీవ్‌గాంధీ కాలనీ, రేణిగుంట

మీరైనా పింఛను ఇచ్చి ఆదుకోండి



అయ్యా నేను పెయింట్ పనిచేసుకునేవాడిని. నాలుగేళ్ల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో నడవలేని స్థితికి చేరుకున్నా. గత ప్రభుత్వంలో పింఛను కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి అలిసిపోయా. మీరైనా ఇచ్చి ఆదుకోండి.

- భాస్కర్, లింగేశ్వర్‌నగర్, తిరుపతి రూరల్ మండలం

మా ఇంటి స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తున్నారు



వెంకటగిరి పట్టణంలో 120 ఎకరాలు ఉంది. ఇందులో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాళ్లం. ప్రస్తుతం నీళ్లు లేకపోవడంతో చుట్టుపక్కల లేఅవుట్లు వెలిశాయి. మేమూ అందులో నివాసం ఏర్పరచుకుని ఉన్నాం. మా అనుభవంలో ఉన్న ఇంటి స్థలాన్ని కబ్జా చేసేందుకు వీఆర్వో, సర్వేయర్ ద్వారా మా సమీప బంధువు నరసింహారావు ప్రయత్నిస్తున్నారు. అతడిపై చర్యలు తీసుకోండి.

- యమున, నాగులగుంట పాళెం, వెంకటగిరి

గుళూరు చెరువును పరిరక్షించండి



చెరువు కలుజుకు అడ్డంగా కంచె నాటి, చెరువును పూడ్చి ఇల్లు కడుతున్నారు. దీంతో స్వరూపమే మారిపోతోంది. స్పందించి చెరువును పరిరక్షించాలి. చెరువులో ఉన్న పట్టాలను రద్దు చేయాలి.

- గూళూరు చెరువు ఆయకట్టుదారులు, వడమాలపేట మండలం

వైద్య విద్యార్థులపై దాడి ఘటనలో చర్యలు తీసుకోండి



వైద్య విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోండి. రుయా అత్యవసర విభాగంలో పనిచేసే మేము రెండు రోజుల క్రితం విధులు ముగించుకుని అల్పాహారం కోసం వెళుతుండగా వెస్ట్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన పోలీసులు ఆపారు. మేము వైద్య విద్యార్థులమని, టిఫిన్ తినడానికి వెళుతున్నామని చెప్పినా వినలేదు. దాడి చేసి, దూషించారు. వారిపై చర్యలు తీసుకోండి.

- ఎస్వీ మెడికల్ కళాశాల విద్యార్థుల డిమాండ్

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★


కథే ఈ సినిమాకు హీరో



దేవన్


దేవన్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కృష్ణలీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్. జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దేవన్ మీడియాతో ముచ్చటించారు. 'ఇదో సూపర్ నేచురల్ లవ్‌స్టోరీ. కొత్తదనంతో నిండిన ఈ కథను నిర్మాతలకు వినిపించగానే ఓకే చేశారు. కృష్ణుడు ఒక ప్రేమ కథలో తన లీలలు ఎలా చూపిస్తారనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. మనుషులు ఎలాగూ గడిచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేరు. దైవత్వంతో ఆ కాలాన్ని తిరిగి తీసుకురావడమే చిత్ర కథాంశం. కృష్ణతత్వాన్ని అందరికీ మరింత బాగా అర్థమయ్యేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి. కథే ఈ సినిమాకు హీరో. ప్రేమలోని గొప్పదనాన్ని అందంగా ఆవిష్కరిస్తుందీ చిత్రం. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. చిత్రం అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

నటుడిగా యాభై ఏళ్లు.. 22న భారీ వేడుక!




విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు నటుడిగా పరిచయమై ఈ ఏడాదికి యాభై ఏళ్లు. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'స్వర్గం నరకం' 1975 నవంబరు 22న విడుదల అయింది. ఈ అసాధారణ ప్రయాణాన్ని గౌరవించుకునే క్రమంలో ఈ నెల 22న 'ఎంబీ 50.. ఏ పెర్ల్ నైట్ ట్రిబ్యూట్' అనే పేరుతో ఓ భారీ వేడుకను మంచు విష్ణు నిర్వహించనున్నారు. 'దిగ్గజ నటుడిని, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొనేలా ఈ ఈవెంట్ ఉంటుందని మంచు విష్ణు చెప్పారు. ఎలాంటి సినిమా నేపథ్యం లేకపోయినా ఒంటరిగా సినీ ప్రయాణం మొదలు పెట్టి, తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని విలక్షణ నటుడిగా ఎదిగిన మోహన్‌బాబు ఎదిగిన జర్నీ గురించి అందరికీ మరోసారి వివరించి చెప్పనున్నారు. ఈ వేడుక పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని మంచు విష్ణు చెప్పారు.

ఉత్తమ నటుడిగా మమ్ముట్టి రికార్డ్!



సోమవారం ప్రకటించిన కేరళ ఫిల్మ్ అవార్డ్స్‌లో మలయాళ చిత్రరంగ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఏడోసారి ఉత్తమ నటుడిగా ఎన్నికై అరుదైన రికార్డ్ నెలకొల్పారు. నటుడు ప్రకాశ్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటైన ఏడుగురు సభ్యులున్న జ్యూరీ కమిటీ అవార్డులను ఎంపిక చేసింది. త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేరళ మంత్రి షాజీ చెరియన్ అవార్డుల వివరాలు వెల్లడించారు. 'భ్రమరయుగం' చిత్రంలో నటించిన మమ్ముట్టి ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'మంజుమ్మల్ బాయిస్' ఎన్నికైంది. ఉత్తమ దర్శకుడు అవార్డ్ సహా మొత్తం ఎనిమిది అవార్డులతో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా తను మరోసారి ఎన్నిక కావడంపై మమ్ముట్టి వ్యాఖ్యానిస్తూ 'ఇదో ప్రయాణం.. రకరకాల వ్యక్తులతో కలసి చేసే సుదీర్ఘ ప్రయాణం. ఇక్కడ పోటీ అనే పదానికి తావు లేదు' అని అన్నారు.

రాకెట్‌కు బాహుబలి పేరు - రాజమౌళి హర్షం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఇటీవలె ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ రాకెట్‌కు దాని బరువు, సామర్థ్యానికి తగ్గట్టుగా 'బాహుబలి' అనే పేరు పెట్టడంపై దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'దేశానికి గర్వకారణమైన క్షణం ఇది. మా సినిమా టైటిల్‌తో ఉన్న రాకెట్ ఇంత గొప్ప విజయాన్ని సాధించడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది' అని ఇస్రో శాస్త్రవేత్తలను రాజమౌళి అభినందించారు.

సినిమా టిక్కెట్‌ల వివాదంపై సుప్రీం స్టే

మల్టీప్లెక్స్‌లలోని సినిమా టిక్కెట్‌లకు ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏకరూప టిక్కెట్ విధానాన్ని (రూ.200 + జీఎస్టీ) ప్రశ్నిస్తూ హొంబలె ఫిల్మ్స్, మల్టీప్లెక్స్‌ల సంఘం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర స్టే ఇచ్చారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సెప్టెంబరు 30న 'ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలి' అని ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం టిక్కెట్ ధరలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. మల్టీప్లెక్స్‌లలో వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నారని, ఇప్పటికే థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోందనీ, మరింత సహేతుకంగా ధరలను నిర్ణయించాలని, లేకపోతే హాళ్లు ఖాళీగా మారిపోతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

మన జీవితాలకు వర్తించేలా ఉంటుంది

'దసరా', 'దియా' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి నటించిన తాజా చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్లపై ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు దీక్షిత్ శెట్టి. 'దసరా' సినిమాలో నేను పోషించిన పాత్ర నచ్చి, 'ది గర్ల్‌ఫ్రెండ్'లో నటిస్తారా అని దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అడిగారు. ఆయన చెప్పిన స్క్రిప్ట్ నచ్చి వెంటనే అంగీకరించాను. ఇందులో నా పాత్ర పేరు విక్రమ్. నా పాత్ర తీరుతెన్నులు ఎలా ఉంటాయి అనేది చాలా క్లియర్‌గా వివరించేవారు రాహుల్. నా పాత్రకు కొన్ని నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. ఇప్పటిదాకా మనం చూసిన ప్రేమకథలన్నీ ఒక తరహాలోనే సాగుతుంటాయి. ప్రేమకథని మరో కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. మనందరి జీవితాలకు వర్తించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు.



దీక్షిత్ శెట్టి

పుత్తూరు వార్తలు

అభివృద్ధిని అడ్డుకునేది మీరే

వైసీపీపై మండిపడ్డ టీడీపీ


సమావేశంలో మాట్లాడుతున్న జీవరత్నం నాయుడు

పుత్తూరు అర్బన్, నవంబర్ 3(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ అభివృద్ధిని అడ్డుకుంటున్నది వైసీపీ కౌన్సిలర్లేనని టీడీపీ ఫ్లోర్‌లీడర్ జీవరత్నం నాయుడు మండిపడ్డారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. బీపీఎస్, ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా ఇటీవల ఎమ్మెల్యే భానుప్రకాష్ రూ.2 కోట్లు మంజూరు చేయించారని, కౌన్సిల్ సమావేశంలో 27 వార్డులకు అభివృద్ధి దిశగా పనుల కోసం టెండర్లు పిలిచే సమయంలో వైసీపీ కౌన్సిలర్లు ఆపేశారన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి అయితే టీడీపీ, కూటమి ప్రభుత్వానికి పేరు వచ్చేస్తుందని అడ్డుకుంటున్నారని విమర్శించారు. వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగ రెడ్డి మాట్లాడుతూ... 27 వార్డుల్లో సమానంగా పనులకు టెండర్లు పిలవడానికి సిద్ధమైతే, టీడీపీ జేబులు నింపడానికి అని ఆరోపించడం అవగాహన రాహిత్యమన్నారు. గతంలో మున్సిపల్ భవన నిర్మాణాన్ని, చెర్లపల్లి రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న చరిత్ర మీదేనని ఆయన ధ్వజమెత్తారు. పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, ఏఎంసీ అధ్యక్షుడు గణేష్, తడుకు పీఏసీఎస్ చైర్మన్ కరుణాయాదవ్,ధనపాల్, కౌన్సిలర్ కేశావాచారి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

పుత్తూరు టౌన్, నవంబర్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుడు ముని కృష్ణయ్య సౌజన్యంతో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తిరుపతి వాసన్ ఐకేర్ కంటి పరీక్షలు నిర్వహించి, 27 మందిని శస్త్రచికిత్సలకు సిఫార్సు చేసింది. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, వాకర్స్ ఇంటర్నేషనల్ సెక్రటరీ కోనేటి రవిరాజు, వెంకటేష్, వైద్యులు కల్పన, శ్రుతి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు


సదాశివేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పుత్తూరు టౌన్, నవంబర్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు శివాలయాల్లో కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని కామాక్షి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయం, రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో వేకువ జామున శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మహిళలు ఆలయాల వద్ద నేతి దీపాలు వెలిగించారు.

గూళూరు చెరువు సమస్యను పరిష్కరిస్తా


గూళూరు చెరువు సమస్యలపై ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న గ్రామస్తులు

వడమాలపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూళూరు చెరువు సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. గూళూరు చెరువు నిండడంతో ముంపు పట్టాలున్న తాము ఏళ్లుగా సాగు చేసుకోలేకపోతున్నామని పలువురు రైతులు తిరుపతిలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనకు విన్నవించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పుత్తూరు, వడమాలపేట మండలాలకు చెందిన సమస్యగా ఉన్న తూముల మరమ్మతులపై జిల్లా అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని చెప్పారు.

సదాశివకోనలో రేపు పౌర్ణమి వేడుకలు



వడమాలపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో దట్టమైన అటవీ ప్రాంతంలోని సదాశివ కోనలో కార్తీక పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించనున్నారు. పౌర్ణమి సందర్భంగా జలపాత స్నానానికి విశేషంగా వస్తుంటారు. బుధవారం రాత్రి లింగోద్భవ అభిషేకం నిర్వహిస్తారు. సదాశివకోన, అమ్మవారికోనలో జాలువారే జలపాతాలున్నాయి. కోనకు వచ్చే భక్తులకు రెండు రోజులపాటు అన్నదాన సంఘాలు నిరంతరాయంగా అన్నదానం చేస్తారు. సదాశివకోనకు వడమాలపేట బైపాస్ రోడ్డు నుంచి నడకమార్గం ఉంది. పుత్తూరు నుంచి నాగలేరు వరకు బస్సు సౌకర్యం తరువాత నడకమార్గం ఉంది. ఏర్పేడు మండల పాపానాయుడుపేట, పాయల్ సెంటర్ మీదుగా ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో వెళ్లాల్సివుంది.

ముక్కంటి సేవలో నారా రోహిత్



శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని సోమ వారం సినీనటుడు నారా రోహిత్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయం వద్ద పాలకమండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరరం వేద పండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, కంఠారమేష్ తదితరులు పాల్గొన్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నర్సింగారావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.


ఆలయం వద్ద జస్టిస్ జ్యోతిర్మయి

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

గుర్తుతెలియని వాహనం ఢీకొని లారీ డ్రైవర్ మృతి

చిల్లకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరు పోలీస్‌స్టేషన్ సమీపంలో సోమవారం వేకువజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని లారీడ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... చైన్నైకు చెందిన ఎలుమలై(51) లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం వేకువ జామున పోలీస్‌స్టేషన్ సమీపంలో లారీని ఆపి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో ఎలుమలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భిక్షగాడిపైకి దూసుకెళ్లిన కారు

కోట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోట బజారు సెంటర్‌లోని గాంధీ బొమ్మ విగ్రహం వద్ద సోమవారం మతి స్థిమితం లేని భిక్షగాడిపై గుర్తుతెలియని కారు ఎక్కడంతో కాలు నుజ్జునుజ్జు అయ్యింది. అతడిని పోలీసులు, రెవెన్యూ అధికారులు ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించారు.


ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న భిక్షగాడు


గూడూరు, సూళ్లూరుపేటలోని శివాలయాల్లో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

శివాలయాలకు కార్తీక శోభ


నాయుడుపేట స్వర్ణముఖినదిలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సూళ్లూరుపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శివాలయాలు కార్తీక శోభ సంతరించుకున్నాయి. సూళ్లూరుపేట పట్టణంలోని నాగేశ్వరస్వామి ఆలయం, మన్నారుపోలూరులోని సంతానేశ్వరస్వామి, టీడీపీ కార్యాలయం వద్దనున్న అభయ శంకరుని ఆలయాల్లో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. నాగేశ్వరస్వామి, అభయశంకరుని ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని స్వర్ణముఖినది తీరాన వెలసిన ప్రసూనాంబసమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే ప్రసూనాంబసమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయాని చేరుకొని భక్తులు స్వర్ణముఖినదిలో స్నానాలు చేసి దీపాలు వదిలి మొక్కులు తీర్చుకున్నారు.

గూడూరు: కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా పట్టణంలోని శివాలయాల్లో పూజలు నిర్వహించారు. స్థానిక శివాలయం, వీరభద్రస్వామి, సోమసుందేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు కార్తీక దీపాలను వెలగించారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని కాశీవిశ్వనాథస్వామి, రామలింగేశ్వర స్వామి ఆలయం, వల్లివేడు క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న మల్లిఖార్జున భ్రమరాంబిక ఆలయాల్లో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు.

శివయ్య సేవకు తరలిన భక్తజనం


పుష్పాలు తీసుకెళుతున్న మాజీ చైర్మన్ గిరినాయుడు దంపతులు, ఈవో రామచంద్రారెడ్డి


ప్రత్యేక అలంకారంలో పరశురామేశ్వరస్వామి

ఏర్పేడు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో మొదటి శివాలయంగా గుర్తింపు పొందిన గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయానికి కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సోమవారం విశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఏటా గుడిమల్లం ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహిస్తారు. ఈ ఆలయం తిరుపతి నుంచి 17 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆ ఆలయంలో విష్ణు, ఈశ్వరుడు, బ్రహ్మ ఏకశిలపై కొలువుదీరి ఉంటారు. గర్భగుడి గజపుష్టాకా రంలో ఉంటుంది. ఈ ఆలయంలో సూర్యనారాయణస్వామి, వల్లీదేవి, అమ్మవారు, విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యస్వామి కొలువుదీరి ఉంటారు.

శాస్త్రోక్తంగా రుద్రాభిషేకం

ఆలయంలో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని సోమవారం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం సహస్ర లింగ పూజ చేశారు. ఈ రుద్రాభిషేకానికి ఆలయం తరఫున ప్రత్యేకపూలను స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలను పాలకమండలి మాజీ చైర్మన్ గిరినాయుడు దంపతులు, ఈవో రామచంద్రారెడ్డి తీసుకువచ్చారు. వేదపండితులు ఆలయ అధికారులు పాల్గొన్నారు.

గుడిమల్లంకు ప్రత్యేక బస్సులు

గుడిమల్లం ఆలయానికి శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండు నుంచి కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నారు.

ఆలయాల్లో మార్మోగిన శివనామ స్మరణ


ముక్కంటి ఆలయం వద్ద దీపారాధన చేస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని శైవ ఆలయాల్లో శంభో శంకరా అంటూ భక్తులు మోకరిల్లారు. ముక్కంటిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఆలయ రెండో గేటు సమీపంలో మహిళలు ఉదయం నుంచి రాత్రి వరకు నేతి దీపాలు వెలిగించారు. అంతకుముందు స్వర్ణముఖి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ముక్కంటిని దర్శించుకున్నారు. అలాగే పట్టణంలోని .జెట్టిపాళెంలో చక్రేశ్వరస్వామి ఆలయం, పిట్టలవారిసంధులో దుర్గామల్లీశ్వరాలయం, కుందేటివారివీధిలోని బృహదీశ్వరాలయం, పానగల్‌లో సర్వ సంపతేశ్వరాలయం, ప్రాజెక్టు వీధి శివాలయం, పట్టణ శివార్లలోని స్వర్ణముఖి నది ఒడ్డున అర్ధనారీశ్వరస్వామి ఆలయం, శ్రీకాళహస్తి మండలం వేడాంలో వెలసిన వెయ్యిలింగాలకోన, భైరవకోనలోని ఆలయాలు, తొట్టంబేడు మండలం పెద్దకన్నలిలోని వీరభద్రస్వామి ఆలయం, సింగమాల శివాలయం, తొట్టంబేడు శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

ముగిసిన లాన్‌టెన్నిస్ పోటీలు



శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విక్రమ్ టెన్నిస్ అకాడమిలో జరుగుతున్న అండర్ 14, 17, 19 ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి బాల బాలికల అంతర్‌జిల్లాల లాన్‌టెన్నిస్ పోటీలు సోమవారం ముగిశాయి. ముఖ్య అతిథులుగా టెన్నిస్ అకాడమీ డైరెక్టర్ చంద్రశేఖర్, టీడీపీ నాయకులు రవిబాబురెడ్డి, బాబురెడ్డి, సుధాకర్, స్కూల్‌గేమ్స్ జిల్లా సెక్రటరీ కిషోర్, పీడీ భార్గవి పాల్గొన్నారు.

అండర్-19 విభాగ విజేతలు

విన్సెంట్(గుంటూరు), తనీష్‌రెడ్డి(చిత్తూరు) మహ్మద్ ఫైసల్ (ఈస్ట్‌గోదావరి), జీవన్ , వైష్ణవసాయిరెడ్డి (చిత్తూరు)

బాలికలు

జోషిత(గుంటూరు), మనస్వి, తన్విశ్రీ(చిత్తూరు), శేషసాయి(పశ్చిమగోదావరి)

అండర్-17 బాలురు

సాయిశంకర్(కర్నూలు), జయ సాయికుమార్(చిత్తూరు), యశ్వంత్ (విశాఖపట్నం), ఇషాంత్‌కృష్ణ (గుంటూరు)

బాలికలు

సాయి సంజనరెడ్డి, అన్సారీ(చిత్తూరు, లోచన(పశ్చిమగోదావరి, జోషిప్రియారెడ్డి(అనంతపురం, అరుషి(విశాఖపట్నం)

అండర్-14 బాలురు

శంకర్ ప్రతీక్(తూర్పుగోదావరి,), సాయి శౌర్యకృష్ణ, రేవత్ రిషి(విశాఖపట్నం), హర్షవర్ధన్ గుంటూరు, సాయి సహర్ష (పశ్చిమగోదావరి)

బాలికలు

తేజశ్రీ తూర్పుగోదావరి, లాస్యప్రియ గుంటూరు, ఏంజిలినా పశ్చిమగోదావరి, సూక్తిశ్రీ గుంటూరు, సత్యశ్రీ గుంటూరు గెలుపొందారు.

అభివృద్ధిలో భాగస్వాములవుదాం: పాశిం


మహిళా బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

కోట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. కోట పట్టణంలో ఆధునీకీకరించిన స్వర్గధామం(హిందూ శ్మశానవాటిక)ను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా కోట పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీలో మహిళా బ్యాంక్‌ను, గిరిజన మత్స్యకారుల కోసం ఏర్పాటు చేసిన ఫిష్ మార్కెట్‌ను సునీల్‌కుమార్ ప్రారంభించారు. అక్కడ నుంచి తిన్నెలపూడి, తాటితోపు సమీపంలో ఉన్న చల్లకాలువ నది వద్దకు చేరుకుని పూడికతీత పనులకు సంబంధించి ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, మాజీ ఎంపీపీ నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నారా రోహిత్‌ను కలిసిన కన్నలి ప్రతాప్‌రెడ్డి



శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు, సీఎం చంద్రబాబు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తినాయుడు కుమారుడు నారా రోహిత్ దంపతులు సోమవారం శ్రీకాళహస్తీశ్వరస్వామి దర్శనార్థం విచ్చేశారు. వారిని టీడీపీ నాయకుడు కన్నలి ప్రతాప్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి వివాహ శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీసిటీని సందర్శించిన యూఎన్ విజన్ దౌత్యవేత్త

- పరిశ్రమలు, విద్య సమన్వయ వాతావరణంపై ప్రశంస


జయరాములు లింగుట్లను సన్మానిస్తున్న రవీంద్ర సన్నారెడ్డి

సత్యవేడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాస్కోలోని ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ ఇన్ఫర్మేషన్ (ఐసీఎస్‌టీఐ) నిపుణుడు, యూఎన్ విజన్ దౌత్యవేత్త జయ రాములు లింగుట్ల సోమవారం రాష్ట్ర పర్యటనలో భాగంగా శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. శాస్త్రీయ ప్రణాళిక, దార్శనిక నాయకత్వంతో రూపొందించచిన శ్రీసిటీ, దాని ప్రాంతీయ సామర్థ్యాలను ప్రపంచస్థాయికి చేర్చిందని ఈ సందర్భంగా సన్నారెడ్డి పేర్కొన్నారు. ఐసీఎస్టీఐ, యునైటెడ్ నేషన్స్ వంటి అంతర్జాతీయ సంస్థలతో కలిపి పరిశ్రమ - విద్యా సమన్వయ విధానాలను అభివృద్ధి చేయడం శ్రీసిటీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. శ్రీసిటీ వేగవంతమైన అభివృద్ధిని ప్రశంశించిన జయరాములు 31 దేశాలకు చెందిన 245కు పైగా సంస్థలు ఇక్కడ నెలకొల్పడాన్ని కొనియాడారు. శ్రీసిటీ పరిశ్రమలు, ప్రభుత్వాలు కలిపి చేపట్టిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ద్వారా స్థానిక యువతకు పరిశ్రమలలో అవకాశాలు కల్పిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. శ్రీసిటీలోని రష్యన్ కంఎనీ కూబిషెన్ అజోట్ సహా పలు పరిశ్రమలను ఆయన సందర్శించి పరిశ్రమ - విద్యా సమన్వయ అనుకూల అంశాలను పరిశీలించారు. అంతర్జాతీయ నైపుణ్య విశ్వ విద్యాలయం స్థాపనకు శ్రీసిటీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. బ్రిక్స్ ఐపీఎం అండ్ ఐపీబీసీ సహాధ్యక్షుడు, యూఎన్‌జీఏ 78 సమ్మిట్ కన్వీనర్, ఐయూసీఎస్ ఆసియా సభ్యుడు, యునా ఏసీటీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న జయరాములు ప్రస్తుతం ఐసీఎస్టీఐ - యూఎన్ పర్యవేక్షణలో మహానందిలో తలపెట్టిన ఆసియా పసిఫిక్ వర్క్ స్టేషన్ (ఏపీడబ్ల్యుఎస్) స్థాపనకు నేతృత్వం వహిస్తున్నారు.

విద్యార్థినికి అభినందన

శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం గుర్తుగా శ్రీకాళహస్తి అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో తొట్టంబేడు మండలం బోనుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన మహిజ ప్రథమ స్థాయిలో నిలిచింది. ఈ నెల 26న అమరావతిలో జరిగే మాదిరి అసెంబ్లీలో ఆమె పాల్గొనుంది. ఈ నేపథ్యంలో సోమవారం డీవైఈవో మహేశ్వర, ఎంఈవో బాలయ్య, ఉపాధ్యాయులు మహిజను అభినందించారు.

ఉపన్యాస పోటీల్లో మేరీ ప్రతిభ

కేవీబీపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదవుతున్న ఆన్స్ మేరీ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవాల పోటీల్లో ఉపన్యాస, క్విజ్ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్రస్థాయిలో నిర్వహించబోయే రాష్ట్ర అసెంబ్లీలో శాసనసభ్యులు తరహాలో మాదరి అసెంబ్లీ నిర్వహణలో పాల్గొనున్నారు. అసెంబ్లీ కార్యక్రమాలు, రాజ్యాంగంపై అవగాహన కోసం వీటిని రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు రవి, ఉష, ప్రధానోపాధ్యాయులు, విమల, పాండు, రవిచంద్ర, సురేష్ పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

రేణిగుంట నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురవరాజు పల్లి గిరిజన కాలనీలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సోమవారం ఆశ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎస్పీ శ్రీనివాసరావు హాజరయ్యారు. అనంతరం కాలనీవాసులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జూలియన్ రాజు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వినియోగం పెంచండి

పెళ్లకూరు, నవంబరు, 3 (ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని నాయుడుపేట వ్యవసాయ సహాయ సంచాలకుడు నాగార్జునసాగర్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని నెలబల్లిలో నారుమడులను ఆయన పరిశీలించారు. మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు నారుమడుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని నాయుడుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు నాగార్జునసాగర్ రైతులకు సూచించారు. కాండం తొలుచు పురుగులను గమనించిన ఆయన వేప నూనె పిచికారి చేయాలని సూచించారు. అలాగే నాట్లు వేసే ముందు 30 కేజీల నారుమడికి ఒక కేజీ కార్బోఫురాన్, 3జీ గుళికలు వేసుకోవాలన్నారు. దీనివల్ల నాటిన నెల రోజుల వరకు పంటకు సస్యరక్షణ కల్పిస్తుందన్నారు. నెలబల్లి రైతు సేవా కేంద్రంలో ఏవో విజయభారతి కలిసి రైతులకు యూరియా పంపిణీ చేశారు. అనంతరం పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హరికృష్ణతో కలసి సమావేశమయ్యారు. అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారుల పెండింగ్ సమస్యలను త్వరతిగతిన పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు.

ప్రతి రైతుకూ యూరియా అందించాలి

గూడూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకూ యూరియా అందించాలని కౌలు రైతు సంఘం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్ అన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది రోజులుగా రైతులు యూరియా పొందేందుకు గుర్తింపు కార్డుల కోసం కార్యాలయం చుట్టు ప్రదక్షణ చేస్తున్నా వ్యవసాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

కనులపండువగా కల్యాణ వెంకన్న జలవిహారం



ప్రత్యేక అలంకరణలో స్వామిఅమ్మవార్లు - తెప్పలపై విహరిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న

నారాయణవనం, నవంబర్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలో టీటీడీ అనుబంధంగా ఉన్న పద్మావతి దేవి సమేత కల్యాణ వెంకన్న ఆలయంలో కార్తీక తెప్పోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మూడోరోజు సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి పద్మసరస్సులో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించి, 7 గంటలకు కల్యాణ వెంకన్న, 8 గంటలకు పద్మావతి అమ్మవారి మూలవిరాట్లకు అభిషేకాలు జరిపారు. 9 గంటలకు ఉభయ నాంచారుల సమేత వెంకన్న ఉత్సవమూర్తులకు కల్యాణ మండలంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చిపై కొలురుదీర్చి మేళతాళాలు, భక్తుల కోలాట ప్రదర్శనల నడుమ పద్మసరస్సుకు వేంచేపు చేశారు. అనంతరం విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించిన తెప్పలపై అధిష్ఠింపజేశారు. ఐదు ప్రదక్షిణలు స్వామివారు జలవిహారం చేస్తూ భక్తులను కటాక్షించారు. టీటీడీ స్థానిక ఆలయ సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా త్రయోదశి పూజలు



నాగలాపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లి పళ్లికొండేశ్వర ఆలయంలో సోమవారం ప్రదోష పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలోని నందీశ్వరుడికి ప్రధాన అర్చకుడు కార్తీకేశన్ గురుకుల్ పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం నందీశ్వరుడికి వివిధ పుష్పాలతో పుష్పాలంకరణ చేసి మహా, కుంభ, నక్షత్ర హారతులు చేపట్టారు. ప్రదోష పూజ అనంతరం ఉత్సవమూర్తులైన మరగదాంబిక సమేత వాల్మీకేశ్వరస్వామిని సుందరంగా అలంకరించి ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. పూజలను ఆలయ ఈవో లత, చైర్మన్ పద్మనాభరాజు ఆధ్వర్యంలో పాలక మండలి సభ్యులు నెల్సన్ మండేలా, శ్రీనివాసులునాయుడు, నాగభూషణమ్మ, హంస, జయంతి, దేవి, హేమంత్ కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

అభివృద్ధిపై అలసత్వం వద్దు: ఎమ్మెల్యే ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు అలసత్వం వహించవద్దని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. మండలంలోని నీర్పాకోటలో రూ.30లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు, రూ.20లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల అభివృద్ధిలో అధికారుల ప్రాత చాలా కీలమన్నారు. వర్షాలకు దెబ్బతిన్న జంబుగోళం, ఆలత్తూరు రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో, వెంకటరత్నమ్మ, ఎంఈవో రవీంద్రనాథ్, ఏఈ నాగరాజు, ఏపీఎం మునెయ్య, సర్పంచ్ విద్యానాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మీ భద్రత నాకొద్దు..



పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే

ఎస్ఐ హరిప్రసాద్ రాకుండా ఇద్దరు పోలీసులను పంపడంతో ప్రొటోకాల్‌లో భాగంగా భద్రత తనకొద్దని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని నీర్పాకోటలో కమ్యూనిటీ భవనం, వాటర్ ట్యాంకులను ప్రారంభించడానికి సోమవారం ఎమ్మెల్యే వచ్చారు. ఎస్ఐ రాకుండా ఏఎస్ఐ, కానిస్టేబుల్ భద్రత కోసం వచ్చారు. దీంతో పోలీసులపై ఎమ్మెల్యే మండిపడ్డారు. ఎమ్మెలే పర్యటనలో ఎస్ఐ స్థాయి అధికారి భద్రత కల్పించాల్సి ఉన్నా కేవలం తూతుమంత్రంగా ఇద్దరి పోలీసులను పంపడంపై మండిపడ్డారు. ఎస్ఐ తీరుపై ఎస్పీ, డీజీపీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి సన్మానం

ఏర్పేడు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి అంబేడ్కర్ బహుజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘన సన్మానం జరిగింది. తిరుపతిలోని అలిపిరి వద్ద ఆర్టీసీ భవనాన్ని ప్రారంభించడానికి విచ్చేసిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని అంబేడ్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ఆర్టీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంబేడ్కర్ స్టార్ కృష్ణ కలిసి ఘనంగా సన్మానించారు

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా తొట్టంబేడు మండలంలో కొలువై ఉన్న అర్ధనారీశ్వరుడికి కార్తీక మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తిరుపతి జిల్లా రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. ఎమ్మెల్యే సుధీర్ తల్లి బృందమ్మ హాజరయ్యారు. ఈశ్వరరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నయనోత్సవం... లక్ష దీపోత్సవం



స్వామిఅమ్మవార్లకు పూజలు- దీపాలు వెలిగించిన ఈవో, చైర్మన్ దంపతులు



శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న వైష్ణవ పుష్కరణిలో కార్తీక మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని ప్రదోష వేళ లక్ష దీపోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ముక్కంటి ఆలయ అధికారులు ముందుగా పుష్కరణి చుట్టూ నేతిదీపాలను సిద్ధం చేశారు. పుష్కరణి ప్రాంగణంలో ముందుగా స్వామి అమ్మవార్ల చిత్రపటానికి విశేష పూజలు, హారతులు సమర్పించారు. అనంతరం సంప్రదాయ బద్ధంగా లక్ష దీపోత్సవాన్ని చేపట్టారు. ధర్మకర్తల మండలి చైర్మన్ సాయి, ఈవో బాపిరెడ్డి దంపతులు, రిషితారెడ్డి నేతి దీపాలను ప్రజ్వలన చేశారు. శ్రీకాళహస్తి క్షేత్రంలో కార్తీక మాసం మొదటి సోమవారం నారద పుష్కరణిలో లక్ష దీపోత్సవం నిర్వహించారు. రెంవో వారం వైష్ణవ కోనేరులో కొనసాగించారు. ఈ విశేష వేడుకను మహిళలు భక్తిశ్రద్ధలతో వీక్షించారు. నేతి దీపకాంతులతో పుష్కరణి తేజోమయంగా ప్రజ్వరిల్లింది. పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

స్వామిఅమ్మవార్ల పురఉత్సవం

- జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిఅమ్మవార్ల పురఉత్సవం వైభవంగా జరిగింది. కార్తీకమాసం సోమవారాన్ని పుర్కరించుకొని రాత్రి ఊరేగింపు జరిగింది. త్రయోదశిని పురస్కరించుకుని ప్రదోష మూర్తులకు ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు.



పాలకమండలి సభ్యుడిగా లక్ష్మీనారాయణ ప్రమాణస్వీకారం



శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడిగా పుట్టపర్తికి చెందిన లక్ష్మీనారాయణ సోమవారం ఆలయయంలోని గురు దక్షిణామూర్తి వద్ద ప్రమాణస్వీకారం చేశారు. ఆయనతో ఈవో బాపిరెడ్డి ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కొట్టే సాయి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



సత్యవేడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లప్పగుంట నుంచి కన్నావరం క్రాస్ రోడ్డు వరకు రూ.2.20 లక్షలతో నిర్మించనున్న తారు రోడ్డుకు సర్పంచ్ బుజ్జమ్మ సోమవారం భూమిపూజ నిర్వహించారు. కన్నావరం నుంచి అల్లప్పగుంట వరకు సుమారు 5 కి.మీ. మేర రోడ్డు ధ్వంసమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల చేయడంతో పనులకు శ్రీకారం చుట్టారు. బాబు, కనకరాజు, సిద్దయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పల్లికొండేశ్వరుడికి సేవ పూర్వజన్మ సుకృతం

- ఆత్మీయ సమావేశంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పద్మనాభరాజు

నాగలాపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లి పళ్లికొండేశ్వర స్వామికి సేవకు అవకాశం రావడం తన పూర్వజన్మ సుకృతమని ఆలయ పాలక మండలి చైర్మన్ పద్మనాభరాజు అన్నారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో సత్యవేడు నియోజకవర్గ టీడీపీ కార్యక్రమాల సమన్వయకర్త కూరపాటి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అట్టహాసంగా ఆలయ ధర్మకర్తల మండలి ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయ పవిత్రను కాపాడడంతో పాటు చరిత్రలో గుర్తుండిపోయేలా అభివృద్ధి చేసే బాధ్యత ధర్మకర్తల మండలిపై ఉందన్నారు. ఇక ఆలయం చుట్టూ సిమెంటు రోడ్డు నిర్మించనున్న నేపథ్యంలో ఇల్లు తొలగింపునకు సంబంధించి పరిహారంగా రూ.15 లక్షలను ఈవో లతకు అందజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పద్మనాభ రాజు మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న కోనేరు, అతిథి భవనాలను పూర్తి చేయిస్తామన్నారు. అంతకుముందు పద్మనాభరాజు ఆధ్వర్యంలో పిచ్చాటూరు నుంచి ర్యాలీగా సురుటుపల్లికి చేరుకున్నారు. పాలకమండలి సభ్యులు హంస రుద్రయ్య, జయంతి, కృష్ణయ్య యాదవ్, దేవి ధనశేఖర్, హేమంత్ కుమార్, కవిత, నెల్సన్ మండేలా, శ్రీనివాసులు, నాగభూషణమ్మ, ముఖ్య అతిథులుగా జడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే హేమలత, డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి, చందన స్రవంతి, అన్నాఅనిత, మాధవనాయుడు, శ్రీనివాసులునాయుడు, కన్నయ్య నాయుడు, సతీష్ నాయుడు, గిరిబాబు హాజరయ్యారు. టీడీపీ నాయకులు మురళీనాయుడు, మనోజ్‌నాయుడు, మస్తాన్, శివకుమార్‌నాయుడు, మునస్వామి యాదవ్, బాలాజీ రెడ్డి, యుగందర్ రెడ్డి, గంధమనేని రాజేష్, లోకయ్య రెడ్డి, నరేంద్ర, చికెన్ చిన్న, మునివేలు, శ్యాంప్రసాద్ రెడ్డి, రాజ శేఖర్ రెడ్డి, సర్పంచ్‌లు రవిరెడ్డి, రూబెన్, పృథ్వీ, డేవిడ్, దిలీప్, దయ పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌రెడ్డి

పారిశుధ్యం మెరుగుపరచండి

శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పురపాలకసంఘ పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను తక్షణం చేపట్టాలని జనసేన నాయకులు కోరారు. పురపాలకసంఘ కార్యాలయంలో కమిషనర్ భవానీప్రసాద్‌ను సోమవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు పట్టణంలో పలు ప్రాంతల్లో ఇంకా వర్షపు నీరు ఇంకా నిల్వ ఉందన్నారు. దీంతో డెంగ్యూ, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు. అదే విధంగా పట్టణంలో కుక్కలు, పందుల బెడద సమస్యను అరికట్టాలని కోరారు. కుమార్, జయప్రకాష్, మాధవ మహేష్, దినేష్, సురేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి రాజీవ్‌నగర్‌లో స్పెషల్ డ్రైవ్: ఆర్డీవో

శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని రాజీవ్‌నగర్‌లో భూ ఆక్రమణలపై బాధితులకు న్యాయం చేసేందుకు మంగళవారం నుంచి అధికారుల బృందంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడారు. గత కొద్ది సంవత్సరాల నుంచి తమ ఇళ్ల స్థలాలు ఆక్రమణకు గురయ్యాయంటూ రెవెన్యూ అధికారులకు నిత్యం వందలాది ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అలాగే లబ్ధిదారులు ఎవరో తెలియక చాలా స్థలాలు 20 ఏళ్ల ఖాళీగానే ఉండిపోయాయన్నారు. స్థలాలు కోల్పోయిన వారికి న్యాయం చేయడంతోపాటు ఖాళీ స్థలాలను గుర్తించి అర్హులైన నిరుపేదలకు కేటాయించేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. రాజీవ్‌నగర్‌లో నిర్వహించే స్పెషల్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆధార్ కేంద్రం తెరిచే వరకు వేచి ఉండాల్సిందే!



కేంద్రం వెలుపల వేచి ఉన్న ప్రజలు

రేణిగుంట నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ఆధార్ కేంద్రం తెరిచే వరకు ప్రజలు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. సోమవారం పంచాయతీ కార్యాలయం పైన ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రం ఉదయం 10 గంటలకు తెరవాల్సి ఉండగా 11.30కు తెరవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. వాస్తవంగా ఆధార్ కేంద్రం సంబంధించిన తాళాలు పంచాయతీ కార్యాలయంలోని క్లర్కు అందించాల్సి ఉంది. ఆయన సోమవారం సెలవు పెట్టడంతో ఆధార్ కేంద్రం తాళాలు పగలగొట్టాల్సి వచ్చింది. ఆధార్‌కార్డులో తప్పొప్పులు సరి చేసేందుకు నిర్ణీత రుసుం కన్నా అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని స్థానికులు చెప్పారు. దీనిపై ఎంపీడీవో రవిచంద్రను వివరణ కోరగా ఆధార్ కేంద్రంలో పనిచేసే వ్యక్తి ఆరోగ్యం సరిగా లేకపోవడం వల్ల ఆలస్యంగా వచ్చాడని, అధిక మొత్తం వసూళ్లపై అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

వేరుశనగ విత్తనకాయలను సద్వినియోగం చేసుకోండి

కేవీబీపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపేడు, కళత్తూరులకు ప్రభుత్వం ద్వారా ఉచిత వేరుశనగ విత్తనకాయలు మంజూరయ్యాయి. ఒక్కో గ్రామానికి 250 బస్తాలు చొప్పున శ్రీకాళహస్తీశ్వర ఎఫ్‌పీవో ద్వారా చేర్చినట్లు ఏవో కృష్ణకుమార్ చెప్పారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేస్తామన్నారు. అయితే రైతులు పండించిన తరువాత మళ్లీ తిరిగి ఆ రెండు బస్తాలను ఎఫ్‌పీవోకు తిరిగి ఇవ్వాలనే ప్రతిపాదనపై పంపిణీ చేస్తారని తెలిపారు. వాటిని ఈ వారంలోనే స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

రేణిగుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాస్ కృషి విజ్ఞాన కేంద్రం లో పుట్టగొడుగుల పెంపకంపై మూడు రోజులు శిక్షణ ఇవ్వనున్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన 18 సంవత్సరాలు నిండిన వారికి ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నారు. పాల పుట్టగొడుగులు, ముత్యపు చిప్ప పుట్టగొడుగులు, విత్తనం ఉత్పత్తి, పెంపకం, వివిధ రకాల విలువ ఆధారిత ఉత్పత్తులు తయారీ, మార్కెటింగ్‌లపై అవగాహన కల్పిస్తారు. నవంబర్ 8వ తేదీ లోగా కార్యాలయంలో నమోదు చేసుకోవాల్సిందిగా కె.వి.కె హెడ్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు.

వార్షిక ప్రణాళికలు తయారు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహిళ సంఘాలు వార్షిక రుణ ప్రణాళికలు తయారు చేయాలని వెలుగు ఏపీడీ ప్రభావతి చెప్పారు. వెలుగు కార్యాలయంలో వీఏవోతో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. బ్యాంకు లింకేజీ, ఉన్నతి, స్త్రీ నిధి, సీఐఎఫ్ రుణాలతో ఎంపిక చేసిన జీవనోపాధులకి పెట్టుబడి పెట్టడం ద్వారా జీవనాన్ని సుస్థిరం చేసుకోవచ్చని తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య జిల్లా ఏపీఎం దాక్షాయణి మాట్లాడుతూ కొరమేను చేపల పెంపకానికి అర్హత కలిగిన వారికి 50 శాతం రాయితీపై రుణాలిస్తారని తెలిపారు. మునగ, వెదురు తోటల పెంపకానికి ఆసక్తి గల మహిళా రైతులను గుర్తించాలన్నారు. ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

మిద్దె నుంచి పడి డ్రైవర్ మృతి

శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో మిద్దె నుంచి పడి ట్యాక్సీ డ్రైవర్ మృతి చెందాడు. శ్రీకాళహస్తి 1టౌన్ ఎస్ఐ రవి కథనం తెలిపిన వివరాలు... శ్రీకాళహస్తి మండలం అమ్మపాళెంకు చెందిన మురళీరెడ్డి(43) పట్టణంలో ట్యాక్సీ నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి శ్రీరామ్ నగర్‌కాలనీలో స్నేహితుల ఇంటికి వచ్చాడు. మద్యం మత్తులో మిద్దె నుంచి రోడ్డుపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి మార్చ్యురీకి తరలించారు. సోమవారం పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబీకులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని...

పిచ్చాటూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి చెందారు. ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాలు... నింద్రకు చెందిన గజేంద్ర(57) ఆటోలో పిచ్చాటూరు వైపు వస్తుండగా, తిరుమల డిపో ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో గజేంద్ర ఘటనా స్థలంలోనే మృతి చెందారు. కాగా గజేంద్రకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

జోరుగా గ్రావెల్ అక్రమ రవాణా

వరదయ్యపాళెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారిపాకం - వితయ్యపాళెం ప్రధాన రహదారి మధ్యలో ఉన్న పొలాల నుంచి తడ మండలంలోని ప్రైవేట్ లే అవుట్‌కు కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా గ్రావెల్‌ను తరలిస్తున్నారు. రెండు రోజులుగా 20, 30 ట్రాక్టర్ల ద్వారా లే అవుట్లకు మట్టిని తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. సామాన్య ప్రజలు ఇంటి నిర్మాణానికి ట్రాక్టర్ మట్టిని తోలుకోవాలంటే సవాలక్ష ఆంక్షలు పెట్టే అధికారులు, ఇంత జరుగుతున్నా పట్టించుకోకపోవడం లేదంటున్నారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు స్పందించి మట్టి రవాణాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎంజీఎం సిల్వర్ జూబ్లీ వేడుకలకు నారా రోహిత్



శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంజీఎం స్కూల్‌లో జరిగిన సిల్వర్ జూబ్లీ వేడుకల్లో సినీ హీరో నారా రోహిత్ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంజీఎం గ్రూప్ చైర్మన్ మల్లికార్జుననాయుడు మాట్లాడుతూ... 2001లో అప్పటి మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు చేతుల మీదుగా ఎంజీఎం స్కూల్ ప్రారంభమైందన్నారు. నేడు రామ్మూర్తినాయుడు కుమారుడు రోహిత్ పాఠశాలకు విచ్చేయడం విశేషమన్నారు. డైరెక్టర్ గూడ్లూరు మయూర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరతలేదు

వరదయ్యపాళెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరత లేదని, ఈ విషయమై రైతులు ఆందోళన చెందాల్సిన అవరం లేదని ఏవో గౌరి తెలిపారు. మండలంలో 7500 ఎకరాల్లో వరి నాట్లు వేయడంవల్ల రైతులందరికీ ఒక్కసారిగా యూరియా అవసరం ఏర్పడిందన్నారు. మరోవైపు పంపిణీకి తగినంత సిబ్బంది అందుబాటులో లేరన్నారు. రైతు సేవా కేంద్రాల్లో 180 టన్నులు, డీలర్ల వద్ద 120 టన్నుల యూ రియా సిద్ధంగా ఉందని, ప్రతి రైతుకు యూరియా అందిస్తామన్నారు.

వేదోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వ రాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయస్వామికి సోమవారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయక స్వామికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులిచ్చారు. అనంతరం మృత్యుంజయుడిని పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించారు. అనంతరం గజమాల, వెండి నాగాభరణంతో శోభాయమానంగా అలంకరించి, ధూప, దీప నైవేద్యాలు, మహామంగళ హారతులు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.